# మహానది

MAHANADI TELUGU DAILY

RNI No. TELTEL . 12/48343

రంగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 41 | | ఎడిటర్ : మామిడి సోమయ్య | ఆదివారం | మే | 17 | 2026 పేజీలు : 8 వెల : రూ.2.00


## 182 కోట్ల ఖరీదైన జిహాదీ డ్రగ్ స్వాధీనం: అమిత్ షా

న్యూఢిల్లీ: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కీలక ప్రకటన చేశారు. దేశంలో తొలిసారి జిహాదీ డ్రగ్ ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అంతర్జాతీయ నార్కోటిక్స్ ట్రాఫిక్కింగ్ బృందంపై ఉక్కుపాదం మోపినట్లు తెలిపారు. కాప్టగాన్ అనే ఆ డ్రగ్ విలువ మార్కెట్లో సుమారు 182 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. డ్రగ్స్ పట్టివేతకు ఆపరేషన్ రేజ్‌పిల్ అనే కోడ్ నేమ్ పెట్టారు. డ్రగ్ ట్రాఫిక్కింగ్‌కు పాల్పడిన విదేశీ వ్యక్తిని అరెస్టు చేశారు. ఆ కన్‌సైన్మెంట్ ను పశ్చిమాసియా దేశాలకు తరలి స్తున్నారు. ఇండియాను ట్రాన్సిట్ మార్గంలో వాడేందుకు ప్రయత్నించారు. అమిత్ షా తన ఎక్స్ అకౌంట్‌లో ఈ విషయాన్ని చెప్పారు. డ్రగ్ ఫ్రీ ఇండియా కావలన్న లక్ష్యంతో మోదీ సర్కారు పనిచేస్తోందని, దానిలో భాగంగానే అరెస్టులు జరిగినట్లు వెల్లడించారు. ఆపరేషన్ రేజ్‌పిల్ ద్వారా జిహాదీ డ్రగ్‌ను పట్టుకోవడం గర్వంగా ఉందని అన్నారు.



### మళ్లీ యుద్ధానికి సిద్ధమవుతున్న

# అమెరికా అధ్యక్షుడు ట్రంప్

### వచ్చే వారంలో ఇరాన్‌పై భీకర దాడులు?

వాషింగ్టన్: చైనా పర్యటన ముగించుకొని స్వదేశానికి తిరిగొచ్చిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్ విషయంలో కీలక నిర్ణయం తీసుకోబోతున్నారని సమాచారం. ఆ దేశంతో నెలకొన్న ఉద్రిక్తతలను సైనిక బలంతోనే పరిష్కరించేందుకు వైట్ హౌస్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒకవేళ చర్చలు విఫలమైతే ఇరాన్‌పై తిరిగి వైమానిక దాడులు చేయాలని పెంటగాన్ వ్యూహాలు రచిస్తున్నట్లు ప్రముఖ పత్రిక 'న్యూయార్క్ టైమ్స్' పేర్కొంది. ఈ కథనం ప్రకారం..బీజింగ్ నుంచి వచ్చే సమయంలోనే ఇరాన్ శాంతి ప్రతిపాదనలను ట్రంప్ పూర్తిగా తిరస్కరించారు. "నేను ఆ ప్రతిపాదనను చూశాను. అందులో మొదటి వాక్యమే నాకు నచ్చలేదు. అందుకే దాన్ని పక్కన పడేశాను" అని ట్రంప్ మీడియాతో అన్నారు. వచ్చే వారంలోనే ఇరాన్‌పై దాడులు జరిగే అవకాశం ఉంది. అందుకోసం అమెరికా, ఇజ్రాయెల్ దళాలు చరిత్రలోనే అతిపెద్ద ఉమ్మడి సైనిక విన్యాసాలు నిర్వహిస్తున్నట్లు పశ్చిమాసియా నిఘా వర్గాలు చెబుతున్నాయి. గత నెలలో కుదిరిన కాల్పుల విరమణ ముగిసిన తర్వాత 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని కొత్త పేరుతో తిరిగి ప్రారంభించేందుకు అమెరికా రక్షణ శాఖ సిద్ధమవుతోంది. హర్మూజ్‌ను మూసివేస్తే ఇరాన్ వ్యాపారాలన్నీ మూతపడతాయని ట్రంప్ పేర్కొన్నారు.



### మోడీ సర్కార్‌పై సీఎం రేవంత్ రెడ్డి

# ఫైర్..!

హైదరాబాద్,: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రంలోనిమోడీ ప్రభుత్వంపైతీవ్ర స్థాయిలోఫైర్ అయ్యారు. దేశవ్యాప్తంగా ఇంధన ధరల పెంపు 'విశ్వాస ఘాతుకమని.. తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఈ నిర్ణయం సామాన్యుల పాలిట పిడుగుపాటు లాంటిదని, ఇరాన్ –ఇజ్రాయిల్ యుద్ధాన్ని సాకుగా చూపి ఇంధన ధరల ను పెంచడం ద్వారా ప్రజల నడ్డి విరిచారని ఆయన విమర్శి ంచారు. ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలి త ప్రాంతం ఎన్నికల ముందు "ధరలు పెంచబోం" అని పదే పదే ప్రకటించిన మోదీ ప్రభుత్వం.. ఫలితాలు వచ్చిన పది రోజులుకూడా గడవకముందే ఈ నిర్ణయం తీసుకోవడం ముమ్మాటికీ ప్రజల నమ్మకాన్ని వంచించడమేనని, ఇది ముమ్మాటికీ విశ్వాస ఘాతుకమని ఆయన ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ అసమర్థ పాలన,అనాలోచితవిధానాల కారణ ంగా దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలైందని, పదేళ్లుగా రూపాయి విలువ పతనంపరాకాష్టకు చేరిందని రేవంత్‌రెడ్డి ఆరోపిం చారు.'ఆత్మనిర్భర్ భారత్' అనేది కేవలం ఓట్లు రాల్చే నినాదం గానే మిగిలిపోయిందని, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు దెబ్బతిని యువత ఉపాధి కోల్పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపామ ని చెప్పుకునే కేంద్రం ఈ పెంపును ఎలా సమర్థించుకుంటు ందని ప్రశ్నించిన ఆయన, పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.



# రాబర్ట్ వాద్రాకు ఊరట..

### మనీ లాండరింగ్ కేసులో బెయిల్ మంజూరు

ఢిల్లీ,: హర్యానాలోని గురుగ్రామ్ భూ కుంభకోణం, మనీలాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేత ప్రియాంకా గాంధీ భర్త, ప్రముఖ వ్యాపారవేత్త రాబర్ట్ వాద్రా కు ఉపశమనం కలిగింది. ఈ రోజు ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో హాజరైన ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. హర్యానాలోని గురుగ్రామ్ (గుర్గావ్) పరిధిలో ఉన్న శిఖోపూర్ గ్రామంలో 2008లో జరిగిన 3.53 ఎకరాల ల్యాండ్ డీల్ చుట్టూ ఈ వివాదం నడుస్తోంది. రాబర్ట్ వాద్రాకు చెందిన 'స్కై లైట్ హాస్పిటాలిటీ' సంస్థ, ఒంకారేశ్వర్ ప్రాపర్టీస్ నుండి ఈ భూమిని కొనుగోలు చేసింది. ఈ ల్యాండ్ డీల్ సమయంలో తప్పుడు పత్రాలు సమర్పించారని, ఎలాంటి నగదు చెల్లించకుండానే లావాదేవీలు జరిపారని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆరోపించింది. వాద్రా తన రాజకీయ ప్రభావాన్ని ఉపయోగించి ఈ భూమికి కమర్షియల్ లైసెన్స్ పొంది.. ఆ తర్వాత 'డీఎల్ఎఫ్' సంస్థకు భారీ లాభానికి విక్రయించారని, దీని ద్వారా రూ. 58 కోట్ల పిఎంఎల్ఏ నేరపూరిత సొమ్ము ఆర్జించారని ఈడీ చార్జ్‌షీట్‌లో పేర్కొంది. ఈ కేసులో దర్యాప్తు సంస్థ దాఖలు చేసిన చార్జ్‌షీట్‌ను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు.. రాబర్ట్ వాద్రాకు సమన్లు జారీ చేస్తూ మే 16న వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆదేశించింది . కోర్టు ఆదేశాల ప్రకారం శనివారం రౌస్ అవెన్యూ కోర్టుకు హాజరైన వాద్రాకు రూ. 50,000 వ్యక్తిగత పూచీకత్తు, అంతే మొత్తానికి సమానమైన ఒక షూరిటీ సమర్పించాలనే షరతుపై ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది.



### నెదర్లాండ్స్ పర్యటనలో

# ప్రధాని మోడీ

- మోడీకి ప్రవాసభారతీయులు ఘన స్వాగతం
- సెమి కండక్టర్ల విషయలంఓ భారత్ దూసుకెళ్తోందని వెల్లడి
- యూనికార్న్ సంస్థలు వందకు చేరాయని ప్రకటన
- మన సంస్కృతీసంప్రదాయాలు చిరస్మరణీయమని కితాబు


న్యూఢిల్లీ, : సెమీకండక్టర్ల విషయంలో భారత్ కీలక ముందడుగు వేసిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భారతదేశం అభివృద్ధిలో దూసుకెళ్తోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. డిజిటల్ చెల్లింపుల్లో ప్రపంచంలోనే భారత్ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. దేశంలో ప్రస్తుతం నెలకు 20 బిలియన్ డాలర్ల డిజిటల్ ట్రాన్సాక్షన్లు జరుగుతున్నాయని తెలిపారు. భారత్‌లో ఒకప్పుడు కేవలం 4 యూనికార్న్ సంస్థలే ఉండేవని.. ప్రస్తుతం అవి 100కు చేరాయన్నారు. సెమీకండక్టర్ల అంశంలోనూ భారత్ ముందడుగు వేసిందని.. ఆ దిశగా పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. నెదర్లాండ్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోదీ.. ది హేగ్ నగరంలో ప్రవాస భారతీయులను కలిశారు. వారితో మాటామంతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐలపై ప్రశంసలు కురిపించారు. లక్ష్యాలను అధిగమించి వారు పని చేస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రధానికి ఘనస్వాగతం లభించింది. ప్రవాస భారతీయులతో కరచాలనం, మాటామంతీ నిర్వహించారు. నెదర్లాండ్స్ నాయకత్వంతో ఎప్పుడు మాట్లాడినా ప్రవాస భారతీయులను ఎంతో ప్రశంసించేవారని ప్రధాని గుర్తు చేసుకున్నారు. హేగ్ నగరం భారతీయ స్నేహానికి సజీవ చిహ్నంగా మారిందన్నారు. కాలం మారినా.. భారతీయ సంస్కృతి మారలేదని కొనియాడారు. ఈ సందర్భంగా ఈయూ దేశాలనుద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డిజిటల్ చెల్లింపుల్లో భారత్ అగ్రస్థానంలో ఉంది.



### కరీంనగర్ పార్లమెంట్ పరిధి కాంగ్రెస్ పార్టీ నేతలతో..

# మంత్రి పొన్నం భేటి

కరీంనగర్ : మినిస్టర్ క్వార్టర్స్ లో కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం నాడు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ ఇంచార్జి లు, అభ్యర్థుల తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్,ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ,కరీంనగర్ డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ,ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్,కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు అంజన్ కుమార్ ,కెకె మహేందర్ రెడ్డి ,ఒడితల ప్రణవ్‌నియోజకవర్గ కోఆర్డినేటర్స్ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి,దుధం వెంకట రమణ , బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మహమ్మద్ ఖాజా ఫక్రుద్దీన్,ఆదేం రాజ్‌దేఖపతి,సౌజన్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ సంస్థాగత అభివృద్ధి పై చేయాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు కార్యక్రమాలు ప్రజల్లోకి వృస్థంగా తీసుకెళ్లడం లాంటి అంశాలు, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో డిసిసి అధ్యక్షులు మండలాల వారిగా పార్టీ సమావేశాలు ఏర్పాటు చేయాలని సమావేశంలో చర్చ జరిగింది.



# శాంతికి భారత్ కీలకం

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో శాంతి నెలకొనేందుకు భారత్ మరింత కీలకపాత్ర పోషించాలని ఇరాన్ విదేశాంగ మంత్రి అరాఘ్చీ కోరారు. ఇరాన్‌కు సంబంధించినంత వరకు ఎలాంటి సైనికపరమైన పరిష్కారం లేదని స్పష్టం చేశారు.

బ్రిక్స్ విదేశాంగ మంత్రుల సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఆయనఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. హోర్ముజ్ జలసంధి అంశం ఇప్పుడు చాలా సంక్లిష్టంగా మారిందంటూ వ్యాఖ్యానించిన ఆయన.. హోర్ముజ్ గుండా అన్ని రకాల నౌకల స్వేచ్ఛాయానానికి అవసరమైన సాయం చేసేందుకు ఇరాన్ సిద్ధంగా ఉందని చెప్పారు. అణ్వా యుధాలను సమకూర్చుకోవాలని తాము కోరుకోవడం లేదన్నారు. పశ్చిమాసియా సంక్షోభ పరిష్కారానికి చర్చలు, సంప్రదింపులు మినహా మరో మార్గం లేనే లేదని పేర్కొన్నారు.

# ప్లాస్టిక్ వాడకాలకు దూరంగా ఉందాం

### స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి ఫరూక్ పిలుపు

నంద్యాల,మే16 : 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని గాంధీ చౌక్‌లో శనివారం ప్లాస్టిక్ నిర్మూలిద్దాం పర్యావరణాన్ని కాపాడుదామనే నినాదంతో పురపాలక అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖమంత్రి ఎన్ఎండీ ఫరూక్, జిల్లా కలెక్టర్ రాజకుమారి పాల్గొని ఎలాస్టిక్ వ్యర్థాలు అందజేసిన ప్రజలకు నిత్యవసర సరకులు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2 కేజీల ప్లాస్టిక్ వ్యర్థాలకు ఒక కేజీ సేమ్యా ప్యాకెట్, ఒక కేజీ ప్లాస్టిక్ కవర్లకు కేజీ చక్కెర, ఒక కేజీకి 12 గుడ్లు అందజేస్తామన్నారు. నిషేధిత ప్లాస్టిక్ విక్రయించకుండా వ్యాపారులు సహకరించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ బండి శేషన్న, తహసీల్దార్ శ్రీనివాసులు, మెప్మా పీడీ వెంకట దాస్, ఇంజినీర్లు నాగభూషణ్ రెడ్డి, రసూల్, పవన్ కుమార్, శానిటరీ అధికారులు లక్ష్మీనారాయణ శర్మ ,మురళీధర్, శివప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### తెలుగు రాష్ట్రాలకు..

# చల్లటి కబురు

### ఈసారి ముందుగానే నైరుతి రుతుపవనాలు

- మే 26 నాటికి కేరళను తాకే అవకాశం ఉందన్న ఐఎండీ
- ఇప్పటికే అండమాన్ నికోబార్ దీవులను తాకిన రుతుపవనాలు
- ఏపీలో మిశ్రమ వాతావరణం
- కొన్నిచోట్ల వడగాల్పులు, మరికొన్నిచోట్ల వర్షాలు

హైదరాబాద్,: అధిక ఉష్ణోగ్రతలు, తీవ్రమైన ఉక్కపోతతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) చల్లటి కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే దేశంలోకి ప్రవేశించనున్నాయని శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. సాధారణంగా జూన్ 1న కేరళ తీరాన్ని తాకే రుతుపవనాలు, ఈసారి మే 26 నాటికే ప్రవేశించే అవకాశం ఉందని అంచనా వేసింది.దీనికి నాలుగురోజులు అటుఇటుగా ఉండే అవకాశం ఉందని కూడా స్పష్టం చేసింది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగాఉండటంతో రుతుపవనాలు శనివారం నాటికి అండమాన్ నికోబార్ దీవులను తాకాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారి ఆంధ్ర, తమిళనాడు తీరాల నుంచి దూరంగా కదులుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రుతుపవనాల రాకకు మార్గం సుగమమైందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. రుతుపవనాలు ఉత్తరం వైపు పయనించే కొద్దీ ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పడతాయని, ప్రజలకు వేడి నుంచి ఉపశమనం లభిస్తుందని ఐఎండీ తెలిపింది. గత 21 ఏళ్లుగా ఐఎండీ రుతుపవనాల రాకపై కచ్చితమైన అంచనాలను వెలువరిస్తోంది.

ఏపీలో వింత వాతావరణం: ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో, ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లో వింత వాతావరణం నెలకొంది. ఒకవైపు కొన్ని ప్రాంతాల్లో 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు పలుచోట్ల అకాల వర్షాలు కురుస్తున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్రమైన వడగాల్పులు వీచే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది.

ముఖ్యంగా అల్లూరి, పోలవరం, కోనసీమ, తూర్పుగోదావరి, ఎన్టీఆర్, అనంతపురం జిల్లాల్లోని సుమారు 20 మండలాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల వరకు చేరవచ్చని తెలిపింది. అదే సమయంలో అల్లూరి సీతారామరాజు, శ్రీ సత్యసాయి, కడప, కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలతో పాటు పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరికలు జారీ చేసింది.

# పార్టీ వద్దనుకుంటే నిరభ్యంతరంగా వెళ్లిపోవచ్చు: మమతా



కోల్‌కతా:పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఓట మినిచవిచూడటంతో పార్టీనికొత్తగా నిర్మించాలని ఆపార్టీ అధినేత్రి మ మతాబెనర్జీనిర్ణయించుకున్నారు. పార్టీలో ఉండాలనుకునేవాళ్లు ఉండవ చ్చుని, వద్దనుకునే వాళ్లు నిరభ్యంతరంగా వెళ్లిపోవచ్చుని స్పష్టం చేశారు. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో కాళీఘాట్ నివాసంలో మమతా బెనర్జీ సమావేశమయ్యారు. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ సైతం హాజరయ్యారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి చవిచూసి నా తిరిగి పుంజుకుంటుందని మమతా బెనర్జీ ఈ సమావేశంలో ఆశాభావం వ్యక్తం చేసారు. 'పార్టీని వీడి వెళ్లాలనుకునే వారు వెళ్లొచ్చు. నేను పార్టీని కొత్తగా నిర్మిస్తాను. పార్టీతోనే ఉండాలనుకునే వారు దెబ్బతిన్న పార్టీ కార్యాలయాలను పునర్నిర్మించండి. రంగులు వేసి తిరిగి ప్రారంభించండి. నేను కూడా పార్టీ కార్యాలయాలకు రంగులు వేస్తాను. తృణమూల్ కాంగ్రెస్ ఎన్నటికీ తలవంచేది లేదు. ప్రజాతీర్పును దొంగిలించారు' అని మమతా బెనర్జీ ఈ సమావేశంలో పేర్కొన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ స్థాయి నుంచి విపక్ష పార్టీ స్థాయికి టీఎంసీ పడిపోయింది. 294 అసెంబ్లీ స్థానాల్లో కేవలం 80 స్థానాలను టీఎంసీ గెలుచుకుంది. మమతా బెనర్జీ సైతం తనకు కంచుకోట అయిన భవానీపూర్‌నుంచి ఓటమిని చవిచూశారు. ఈ క్రమంలో పార్టీలో అంతర్గతవిభేదాలు తలెత్తాయని,పలువురు నాయకులు ఫిరాయింపులకు పాల్పడే అవకాశం ఉందని ఊహాగానాలు వెలువడుతున్నాయి. మే 5న ఏర్పాటు చేసిన మీడియా సమావేశ ంలోనూ మమతా బెనర్జీ కొందరు నాయకులు ఫిరాయింపులకు పాల్పడే అవకాశాలున్న విషయం తనకు తెలుసునని అన్నారు.

# ఘనంగా నల్ల పోచమ్మ ఆలయంలో శని హోమం



**హైదరాబాద్,మహానది న్యూస్,మే 16:** అమావాస్య, శని జయంతి సందర్భంగా శనివారం హైదరాబాద్, కోటి బ్యాంక్ స్ట్రీట్, రాణి పార్క్ సమీపంలోఉన్న నల్ల పోచమ్మ ఆలయంలో శనిహోమం,అన్నదాన కార్య క్రమం నిర్వహించారు. ఉదయం 9:00గంటలకు శని దేవుని ఆశీస్సులు కోరుతూ పలువురు భక్తులు పాల్గొనడంతో శని హోమం ప్రారంభమైంది.

అనంతరం, బజరంగ్ సేన తెలంగాణ అధ్యక్షులు ఎన్.ఆర్. లక్ష్మణరావు మధ్యాహ్నం 12:30 గంటల నుండి అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు, స్థానికుల నుండి అద్భుతమైన స్పందన లభించింది.

కార్యక్రమాన్ని జయప్రదం చేసిన భక్తులు, వాలంటీర్లు, మద్దతుదారుల ందరికీ ఎన్.ఆర్. లక్ష్మణరావు ధన్యవాదాలు తెలియజేశారు.




మహానది: నూతనంగా ఎన్నికైన తెలంగాణ పద్మశాలి కమ్యూనిటీ చైర్మన్ గూడూరు శ్రీనివాస్ ని సన్మానిస్తున్న పద్మశాలి ప్రముఖులు...

# ఆర్ కే పురం డివిజన్ లో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం

**-చొరవ చూపిన డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్ నేత**

**మహేశ్వరం,మహానది న్యూస్, మే15 :** మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని శ్రీ రామకృష్ణాపురం (ఆర్ కేపురం) డివిజన్, ఎస్‌బీఐ ప్రైవేట్ హౌసింగ్ కాలనీ రోడ్డు నెంబర్ 4లో గత కొంతకాలంగా వేధిస్తున్న డ్రైనేజీ సమస్యకు తక్షణ పరిష్కారం లభించింది. శుక్రవారం ఉదయం మార్నింగ్ వాక్ నిర్వహించిన సందర్భంగా, డ్రైనేజీ లైన్లు నిండి మురుగు నీరు రోడ్లపై పొంగిపొర్లుతున్న విషయాన్ని కాలనీ అధ్యక్షులు భిక్షం రెడ్డిస్థానిక నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఈసమస్య తీవ్రతను గమనించిన ఆర్కే పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్ నేత తక్షణమే స్పందించారు. ఆయన వెంటనే జలమండలి సివరేజ్ బోర్డు అధికారులతో మాట్లాడి, సిబ్బందిని అక్కడికి రప్పించారు. స్వయంగా క్షేత్రస్థాయిలోఉండి పనులను పర్యవేక్షించి,డ్రైనేజీ అడ్డంకులను తొలగించి సమస్యను పరిష్కరింపజేశారు. ఈకార్యక్రమంలో సివరేజ్ బోర్డు సూపర్వైజర్ సంతోష్ కుమార్, నవీన్, బోర్డు సిబ్బంది పాల్గొన్నారు.



# పెట్రో ధరలపై ఎల్బీనగర్‌లో బీఆర్ఎస్ భారీ గర్జన

**ఎల్బీనగర్,మహానది న్యూస్, మే 16:** కేంద్ర ప్రభుత్వం నిరంతరాయంగా పెంచుతున్న పెట్రోల్, డీజిల్ ధరలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది. స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నాయకత్వంలో ఎల్బీనగర్ చౌరస్తా వద్ద బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, సామాన్యుల పట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తూర్పారబట్టారు. ఈ నిరసన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే దేవిరెడ్డిసుధీర్ రెడ్డి మాట్లాడుతూ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రో ధరలను విచ్చలవిడిగా పెంచుతూ పేద, మధ్యతరగతి ప్రజల జీవితాలతో ఆడుకుంటోందని తీవ్రంగా విమర్శించారు. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గుతున్నప్పటికీ, దేశంలో మాత్రం ధరలు పెంచడం వెనుక ఉన్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించారు. తక్షణమే పెంచిన ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ డి విజన్ అధ్యక్షులు, ఉద్యమ నాయకులు, పార్టీ శ్రేణులు, మహిళా కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. నియోజకవర్గంలోని అన్ని విభాగాల నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చి నిరసన తెలపడంతో ఎల్బీనగర్ చౌరస్తా జనసంద్రంగా మారింది. ప్రజా సమస్య లపై రాజీలేని పోరాటం చేస్తామని నాయకులు స్పష్టం చేయడంతో నిరసన కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.




## చిట్టి చేతులతో చిన్నచిన్నగా..

# పిల్లలకు ఆర్థిక పాఠాలు చెప్పండిలా



మనలో చాలామంది.. పిల్లలకు ఓ వయసు వచ్చాకగానీ ఆర్థికపరమైన అంశాల జోలికి వెళ్లనివ్వం. అందుకే నేడు మెజారిటీ యువతకు కుటుంబ ఆర్థిక పరిస్థితులపై సరైన అవగాహన ఉండటం లేదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. అయితే పసితనం నుంచే తల్లిదండ్రులు పిల్లలకు ఆర్థిక పాఠాలు నేర్పితే.. వారికి ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. నగదు విలువ, పొదుపు వంటివి చిరుప్రాయంలోనే వివరించగలిగితే.. పెద్దయ్యాక వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంటున్నారు. పాఠ్యపుస్తకాల్లో చదివేదానికంటే జీవితంలో చూసి నేర్చుకునేదే ఎంతో ముఖ్యం మరి. ఇదీ సంగతి: పిల్లలు ఆర్థికపరమైన విషయాలను కేవలం వినడం ద్వారానేగాక.. పెద్దల ప్రవర్తనను చూస్తూ నేర్చుకుంటారు. కనుక తల్లిదండ్రులు ఆర్థిక అంశాలను పిల్లల వద్ద దాచిపెడితే.. వారికి వాస్తవ పరిస్థితులపై అవగాహన కొరవడుతుంది. అందుకే మన ఖర్చులు, సంపాదన ఇలాంటివన్నీ వారికి తెలిసేలా చేయడం ఎంతైనా మంచిది. ఇక మీరు వృథా ఖర్చులు చేస్తూపోతే.. మీ పిల్లలూ అదేవిధంగా తయారయ్యే ప్రమాదం ఉన్నది. అలాగే చిన్న పిల్లలు కదా అని, మారాం చేస్తున్నారని అడిగింది ఇస్తూపోతే డబ్బు విలువ తెలియకుండాపోతుంది. కాబట్టి ఏది అవసరం? మరేది అనవసరం? అన్నది వారికి తెలియజేస్తూ.. అక్కెరకు వచ్చేవి మాత్రమే అందించాలి. పిల్లలు పెద్ద పెరుగుతున్నప్పుడు సమయం ఉన్నప్పుడల్లా మీ ఆర్థిక ఒత్తిళ్లనూ వారితో పంచుకుంటే.. కుటుంబ ఆర్థిక పరిస్థితులకు తగ్గట్టుగా వారూ నడుచుకుంటారు. ఇక పొదుపు, పిసినారితనానికి మొదట్లో చిన్న గీతే అడ్డుగా ఉంటుంది. ఆ గీతకున్న అర్థం పిల్లలకు తొలినాళ్ల నుంచే తల్లిదండ్రులు వివరించినెట్లైతే.. మనవారు పూర్తిగా డబ్బు మనుషులు కాకుండా కూడా జాగ్రత్తపడవచ్చు. పెట్టుబడులతోపాటు బీమా అవసరాన్నీ తెలియజెప్పాలి. అప్పుడే సరైన ఆర్థిక ప్రణాళికల్ని వేసుకునే సామర్థ్యం వారికి ఉంటుంది. ఏవైనా ఎదురు దెబ్బలు తగిలినప్పుడు ఎలా నిలదొక్కుకోవాలి, కుటుంబం అండకు ఎంత ప్రాధాన్యం ఉంటుంది.. అన్నదీ పిల్లలకు వివరిస్తూపోతే భవిష్యత్తులో ఆర్థికపరంగానూ, కుటుంబపరంగానూ బలంగా తయారవ్వగలరు.

# కొబ్బరికి యుద్ధ కష్టాలు



కాకినాడ : కొబ్బరి అనగానే కేరళ తరువాత కోనసీమ గుర్తుకు వస్తుంది. కోనసీమ వ్యాప్తంగా కొబ్బరి ఎగుమతులకు పెట్టింది పేరు. ఇక్కడి నుంచి ప్రతీ రోజూ టన్నుల కొద్దీ కొబ్బరి స్వదేశీ మార్కెట్‌కే కాక ఇతర దేశాలకు ఎగుమతులు అవుతుంటాయి. అయితే మిడిల్ ఈస్ట్‌లో జరుగుతోన్న ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య యుద్ధం ప్రభావం ఈ కొబ్బరి మార్కెట్ పైన కూడా పడిందంటున్నారు కొబ్బరి వ్యాపారులు. ఈ పరిస్థితి ఏపీలోని అంబేడ్కర్ కోనసీమ జిల్లాతోపాటు తమిళనాడు, కేరళ మార్కెట్లపై తీవ్ర ప్రభావం ఉంటుందంటున్నారు. కొబ్బరి సాగుకు దక్షిణాది రాష్ట్రాలైన ఏపీ, తమిళ నాడు, కేరళ, కర్ణాటక పెట్టింది పేరు. గతంలో దేశీయ మార్కెట్‌లోనే కొబ్బరి ఎగుమతులు ఉండగా కొన్నేళ్లుగా మన దేశీయ కొబ్బరికి మిడిల్ ఈస్ట్ దేశాల్లో బాగా డిమాండ్ పెరిగింది. ముఖ్యమంగా ఏపీ, తమిళనాడు ప్రాంతాల నుంచి గల్ఫ్ దేశాలకు ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయంటున్నారు. రంజాన్ మాసం కావడంతో కొబ్బరికి డిమాండ్ ఏర్పడింది. సాంప్రదాయ వంటకాల్లో కొబ్బరిని ఎక్కువుగా వాడుతున్నారని, దీంతోపాటు ఆదేశ సౌందర్య, ఇతరాత్ర తయారీ సామాగ్రిలో కొబ్బరి వినియోగం బాగా పెరిగిందంటున్నారు. కువైట్, ఒమన్, దుబాయ్, ఇరాన్, సౌదీకి కొబ్బరి ఎగుమతులు జరుగుతుండగా ఆ దేశాలకు ఎగుమతులు చేసేందుకు అంతా సిద్ధం చేశారు.ప్రస్తుతం మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ వాతావరణంతో గుబులు పుట్టిస్తోంది. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా సేనలు విరుచకుపడుతున్నాయి. మరో పక్క దుబాయ్, కువైట్, సౌదీ అరేబియా, ఒమాన్, బెహ్రాయిన్ దేశాలపై ఇరాన్ డ్రోన్లతో దాడులు చేస్తుంది. ఈ పరిస్థితుల్లో ముంబయి, చెన్నై, తూత్తుకూడి పోర్టుల్లోనే కొబ్బరి కాయలతో కంటెయినర్లు నిలిచిపోయాయని అంబాజీపేట కొబ్బరి మార్కెట్‌కు సంబందించిన కొబ్బరి వ్యాపారులు, రైతులు చెబుతున్నారు.యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో.. ఆయా దేశాలకు ఎగుమతులు ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొందంటున్నారు. ఆయా ఓడరేవుల్లో ఉన్న సరకును స్థానికంగా తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, ధరల పతనంతో తీవ్రంగా నష్టపోతున్నామంటున్నారు. గత నెలలో శివరాత్రి సందర్భంగా కోనసీమ కొబ్బరి మార్కెట్లో ధరలు ఆశాజనకంగా ఉన్నాయని, వెయ్యి పచ్చి కాయలు రూ.18-20 వేలు పలికాయని రైతులు వెల్లడించారు. కురిడీల ధరలూ బాగానే ఉండగా శ్రీరామనవమికి దేశవ్యాప్తంగా మంచి ధర వస్తుందని వ్యాపారులు ఆశించారు. ఓడరేవుల ద్వారా గల్ఫ్ దేశాలకు వెళ్లే కొబ్బరికాయలు అక్కడే నిలిచిపోవడంతో ధరలపై ప్రభావం చూపిందంటున్నారు.

# అటు రంగస్థలం.. ఇటు విద్యావనం

నాటకాన్ని ప్రేమించి, నటుడిగా శ్రమించి, నిరంతరం నాటక కళామత ల్లి సేవలో పునీతమవుతున్న కళాకారుడు కూనపరెడ్డి సత్యనారాయణ. ఒక్కపక్క రంగస్థలంలో రాణిస్తూనే- మరోపక్క విద్యారంగంలోనూ విలువైన సేవలు అందిస్తున్నారు. విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ఐదు దశాబ్దాలకు పైగా రంగస్థల నటుడిగా ఆయన రాణిస్తున్నారు. నటనలో ఎన్టీఆర్, ఎస్వీఆర్, ఎఎన్నార్‌లను అనుకరించే ఆయన పౌరాణిక నాటకాల ప్రదర్శనలను బాగా ఇష్టపడతారు. కంచుకంఠంతో డైలాగుల డెలివరీలో స్పష్టత ప్రదర్శిస్తారు. ఏ పాత్రలోనైనా ఒదిగిపోయి జీవిస్తారు. కళాకారుడిగా తనకు నచ్చి, మెచ్చిన నాటక రంగ ప్రదర్శనలు ఎక్కడ జరిగినా వెళ్లి పాల్గొంటారు. తనదైన శైలిలో హావభావాలు ప్రదర్శిస్తూ శభాష్ అని పిలిపించుకుంటారు.

కృష్ణాజిల్లా పెడన మండలం చెన్నూరు గ్రామానికి చెందిన కూనపరెడ్డి వెంకమ్మ, నాగేశ్వరరావు దంపతుల కుమారుడు సత్యనారాయణ. చెన్నూరు గ్రామం కళాకారులకు పుట్టినిల్లు. ఆ గ్రామంలో గతంలో ప్రతి ఇంట్లో ఒక కళాకారుడు ఉండేవారు. ఆయన తండ్రి నాగేశ్వరరావు శ్రీరామాంజనేయుద్ధంలో యయాతి, రామాంజనేయ యుద్ధంలో బూరికీర్తి, కురుక్షేత్రంలో ధర్మరాజు పాత్రల్లో దిట్ట. తండ్రిలోని గాత్రం, నటనాశైలిని పుణికిపుచ్చుకున్న సత్యనారాయణ తనకంటూ సరికొత్త ఒరవడితో నాటక రంగ కళాకారుడిగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందారు. ప్రముఖ రంగ స్థల నటులు ఆచంట వెంకటరత్నం నాయుడు గాత్రాన్ని సత్యనారాయణ అన్వయిస్తూ పద్యాలు అవలీలగా పాడతారు. విజయనగరానికి చెందిన బి.రామచంద్రరావు నాయుడు స్ఫూర్తితో ఆయన విశ్వామిత్ర పాత్రను ఎంపిక చేసుకున్నారు. విశ్వామిత్ర రాజరుషి పాత్రలో వికటాట్టహాసం కాకుండా అవసరం మేరకే రాగాలాపన చేస్తారు. డైలాగుల డెలివరీలోనూ, పద్యాల ఆలాపనలోనూ స్పష్టతతో కంచుకంఠంతో ఆలపించేవారు. పదాన్ని విడమర్చి చెప్పటంలోనూ దిట్ట. మహానటులు ఎన్టీఆర్, ఎస్వీఆర్ వంటి సినీరంగ ప్రముఖుల సినిమాలను వీక్షిస్తూ వారిని అనుకరించేవారు. డైలాగుల డెలివరీ అచ్చు వారిలాగే ఉండేది. పద్యాలు ఆలపించటంలోనూ, రాగాలు తీయటంలోనూ, హావభావాలను ప్రదర్శించటంలోనూ సరికొత్త ఒరవడి ప్రదర్శించారు. సత్యనారాయణ తన 11వ ఏటనే పాఠశాలలోని వివిధ వేదికలపైన తన నటనను ప్రదర్శించి ఉపాధ్యాయులు, తోటి విద్యార్థుల నుంచి అభినందనలు అందుకున్నారు. తెలుగు పండితులు మద్దూరి రామ్మోహనరావు ఆయన నటనా కౌశలాన్ని ప్రోత్సహించి అనేక నాటికల ప్రదర్శనలకు అవకాశం కల్పించారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాల విద్యను చెన్నూరు ప్రభుత్వ పాఠశాలలోనూ, ఐటిఐ, డిప్లమోను కాకినాడలో పూర్తిచేశారు. అనంతరం ధవళేశ్వరంలో సాంకేతిక విద్యకు సంబంధించిన శిక్షణను పూర్తిచేశారు. అటు కళాశాలఉద్యోగం, ఇటుకళారంగంలో ప్రతిభను సుసంపన్నం చేసుకు న్నారు. ఎందరో విద్యార్థులకు దిశా నిర్దేశం చేస్తూ మార్గ దర్శకులుగా నిలిచారు. ఐటిఐ కళాశాలలో అధ్యాపక వృత్తి చేపట్టి కళాశాల ప్రిన్సిపల్‌గా స్థిరపడ్డారు. ఆ తర్వాత ఎస్‌పిఎఎం ఐటిఐ కళాశాలను స్థాపించి ఏటా వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు.ఏడు పదుల వయస్సులోనూ నాటక ప్రదర్శనల్లో చురుగ్గా పాల్గొంటూ తనలోని కళాపిపాసను బయటపెడుతున్నారు. ఎక్కడ నాటక కళాప్రదర్శనలు జరిగినా వెళ్లి వీక్షిస్తూ వాటిని ప్రోత్సహించటంలోనూ ఆయన ముందుంటారు. కళాకారుడిగా పలు పాత్రల్లో ఆయన నటించి మెప్పిస్తున్నారు. పాత్ర ఏదైనా పరిణిత నటనతో అందులో జీవించటం ద్వారా ఉత్తమ నటుడిగా అనేక పురస్కారాలు, అభినందనలు అందుకున్నారు. పౌరా ణిక నాటకాల్లో సత్యహరిశ్చంద్రలో విశ్వామిత్రునిగా, రామాంజనేయ యుద్దంలో లక్ష్మణుడిగా ఆయన నటనా కౌశలం అద్భుతం. పల్లెపడుచు, చిల్లరకొట్టు చిట్టెమ్మ, పూలరంగడు సాంఘిక నాటకాల్లో ఆయన కనబర్చిన నటన అద్వితీయం. జై శ్రీ నాట్యమండలి అధినేత కీర్తిశేషులు కొడాలి వీరాంజనేయులు గారి కుమారుడు కొడాలి రాజా వద్ద పౌరాణిక నాటకాల్లో నటనా ప్రావీణ్యం పొంది దుద్దుకూరి సాయి బాబు, కోరుకొల్లు నాని ప్రోత్సాహంతో జూనియర్ డివి సుబ్బారావు, పద్మశ్రీ వై.గోపాలరావు, ఉప్పాల నాంచారయ్య, ఉప్పలపాటి సైదులు, పి.లక్ష్మణరావు, బెండపూడి రామారావు, కిలారు లక్ష్మి, జయ నిర్మల, బొబ్బిలి సావిత్రి, ఎ.వెంకటేశ్వరరావు, పి.వి.రామాంజనేయులు మొదలైన వారితో కలిసి నటించారు.



పౌరాణిక సంస్థల దిగ్గజాల చేత కొన్ని వందల ప్రదర్శనలు ఇచ్చి మెప్పించారు. విద్యావేత్తగా, విద్యాసంస్థ అధినేతగా విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దటంలో ఆయన తన వంతు పాత్ర పోషిస్తున్నారు. పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు ఉపాధి శిక్షణకు అవసరమైన కోర్సులు ఎంపిక చేసుకునేలా 'స్పామ్' ఐటిఐను ముదినేపల్లిలో ఏర్పాటు చేశారు. గత 30 సంవత్సరాలుగా అత్యుత్తమ విద్యాప్రమాణాలను పాటిస్తూ విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తున్నారు. కళా,సాంస్కృతిక, భాషా రంగాల్లో అపారమైన అనుభవం, ప్రజ్ఞ ఉన్న ఆయన నిరంతరం కొత్త విషయాలను తెలుసుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. అధునాతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటూ తమ కళాశాలలో చదివే విద్యార్థినీ విద్యార్థులను ఉపాధి శిక్షణలో సరికొత్త ఒరవడి, నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు.

# సంపాదకీయం

## ఢిల్లీలో దోస్తీ... గల్లీలో కుస్తీ..!

ప్రస్తుతం భారత రాజకీయాల్లో 'శత్రువుకు శత్రువు మిత్రుడు' అనే సూత్రం విపక్షాల ఐక్యతకు దిక్సూచిగా మారింది. ఇండీ కూటమిలో అంతర్గత విభేదాలు ఉన్నప్పటికీ, లోక్‌సభ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం మరియు సీఈసీపై అభిశంసన తీర్మానం వంటి అంశాలు విపక్షాలను ఏకం చేయడానికి రాజకీయ అస్త్రాలుగా దొరికాయి. ఇవి కేవలం తీర్మానాలు మాత్రమే కావు, విపక్షాల ఐక్యతకు ఒక 'లిట్మస్ టెస్ట్' వంటివి. సంఖ్యాబలం లేకపోయినా ప్రభుత్వాన్ని డిఫెన్స్‌లో నెట్టగలమనే ఆత్మవిశ్వాసాన్ని ఇవి విపక్షాల్లో నింపాయి. అయితే, ఢిల్లీ స్థాయిలో కనిపిస్తున్న ఈ ఐక్యత రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి మాయమవుతోంది. బెంగాల్‌లో మమత వర్సెస్ కాంగ్రెస్-లెఫ్ట్, కేరళలో ఎల్డీఎఫ్ వర్సెస్ యూడీఎఫ్ పోరు విపక్షాల ద్వంద్వ వైఖరిని స్పష్టం చేస్తోంది. సీట్ల సర్దుబాటు, ప్రాంతీయ అస్తిత్వ పోరాటాలు ఈ కూటమికి పెను సవాలుగా మారాయి. తమిళనాడు, మహారాష్ట్రలో పొత్తులు బలంగా ఉన్నప్పటికీ, పంజాబ్, కేరళ, బెంగాల్ వంటి రాష్ట్రాల్లో విపక్షాల మధ్య 'పగటి పూట స్నేహం - రాత్రి పూట యుద్ధం' అనే చందంగా రాజకీయాలు సాగుతున్నాయి. శత్రువుకు శత్రువు మిత్రుడు అవుతారంటారు. ప్రస్తుతం దేశ రాజకీయాలు ఈ సమీకరణంతోనే నడుస్తున్నాయి. ముఖ్యంగా విపక్ష కూటమి. పైకి చూస్తే ఎవరికి వారే అన్నట్టుగా కనిపిస్తున్నా.. రాజకీయ శత్రువు కళ్ల ముందు కనిపించే సరికి.. ఏకం అవ్వాలనే కసి పెరుగుతోంది. నిజానికి, విపక్షాలకీ కలవాలనుంది. కలవడానికి బలమైన కారణాలూ ఉన్నాయ్. ఇండీ కూటమి విచ్ఛిన్నమైనా విపక్షాల్ని ఏకం చేయడానికి అస్త్రాలు వరుసగా దొరుకుతున్నాయ్. అందులో మొదటిది లోక్‌సభ స్పీకర్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం. అఫ్‌కోర్స్ ఆ తీర్మానం వీగిపోయింది. రెండ్రోజుల చర్చ తరువాత.. బుధవారం సాయంత్రం నాటి ఓటింగ్‌లో మూజువాణి ఓటుతో ఆ తీర్మానాన్ని తిరస్కరించింది లోక్‌సభ. నిజానికీ ఈ తీర్మానం వీగిపోతుందని విపక్షానికి కూడా తెలుసు. కాకపోతే.. అందులో ఓ రాజకీయ వ్యూహం ఉంది. ఇండీ కూటమి ఐక్యతకు అదో లిట్మస్ టెస్ట్ లాంటింది. ఈ తీర్మానం విపక్షాల మధ్య ఉన్న అంతర్గత విభేదాలను పక్కన పెట్టి, వారిని ఒకే తాటిపైకి తెచ్చింది. ఎలా చెప్పగలరు అలా అంటే.. కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, సమాజ్‌వాదీ పార్టీలు కలిసి ఉమ్మడిగా నోటీసు ఇచ్చాయి. తీర్మానంపై చర్చ జరిగినప్పుడు కూడా ఒక్కటిగానే నిలబడ్డాయి. ఓటింగ్ సమయంలో కలిసే ఉండాలని మాట్లాడుకున్నాయి. ఓవరాల్‌గా.. సీట్ల సర్దుబాటులో సమస్యలు ఉన్నప్పటికీ.. బీజేపీ వ్యతిరేక పోరాటంలో తామంతా ఒక్కటేననే సంకేతాన్ని ప్రజల్లోకి పంపాయి విపక్షాలు. అటు బెంగాల్ లో మాత్రం పశ్చిమ బెంగాల్‌లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలిగిన వామపక్షాలు, కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు తమ ఉనికిని చాటుకోవడంతో పాటు మమతా బెనర్జీని గద్దె దించడమే పరమావధిగా ముందుకు సాగుతున్నాయి. గత ఎన్నికల్లో సున్నా స్థానాలకే పరిమితమైన ఈ కూటమి, ఈసారి క్షేత్రస్థాయిలో టీఎంసీ వ్యతిరేక ఓటును బీజేపీ వైపు మళ్లకుండా తమ వైపు తిప్పుకోవాలని చూస్తోంది. ముఖ్యంగా తృణమూల్ ప్రభుత్వంపై ఉన్న అవినీతి ఆరోపణలు, నిరుద్యోగ సమస్యలను అస్త్రాలుగా చేసుకుని మమతా కంచుకోటలను బద్దలు కొట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. మమతా బెనర్జీకి అండగా నిలిచే మైనారిటీ , గ్రామీణ ఓటు బ్యాంకును దెబ్బతీయడం ఈ కూటమి ప్రధాన ఉద్దేశం. గతంలో కాంగ్రెస్‌కు పట్టున్న మాల్డా, ముర్షిదాబాద్ వంటి జిల్లాల్లో టీఎంసీని అడ్డుకుంటే, రాష్ట్రస్థాయిలో మమతా ప్రాభవం తగ్గుతుందని వీరి అంచనా. మమతా బెనర్జీకి వ్యతిరేకంగా మాట్లాడే ప్రతి ఓటు తమకే పడాలని, తద్వారా టీఎంసీని బలహీనపరిచి మళ్లీ రాష్ట్రంలో తాము ఒక నిర్ణయాత్మక శక్తిగా ఎదగాలని లెఫ్ట్-కాంగ్రెస్ నేతలు భావిస్తున్నారు. ఈ టాస్క్ లో భాగంగానే వీరు సంయుక్తంగా భారీ ర్యాలీలు నిర్వహిస్తూ క్యాడర్‌లో నూతనోత్సాహాన్ని నింపుతున్నారు. టీఎంసీకి వ్యతిరేకంగా నిరంతరం వీధుల్లో పోరాడుతున్న ఎస్ఎఫ్ఐ , డీవైఎఫ్ఐ వంటి యువజన సంఘాలను లెఫ్ట్ కూటమి ముందు వరుసలో నిలుపుతోంది. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జరిగిన కుంభకోణాలను నేరుగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ద్వారా మమతా బెనర్జీ క్లీన్ ఇమేజ్‌ను దెబ్బతీస్తున్నారు. మమతా బెనర్జీని పూర్తిగా ఓడించలేకపోయినా, ఆమెకు మ్యాజిక్ ఫిగర్ అందకుండా చేయడమే ఈ కూటమి అసలు టాస్క్. తద్వారా రాష్ట్రంలో టీఎంసీ ఏకపక్ష నిర్ణయాలకు అడ్డుకట్ట వేయవచ్చని వీరు భావిస్తున్నారు. మమతా వ్యతిరేక ఓట్లు కేవలం బీజేపీకే పడతాయనే భ్రమను తొలగించి, తటస్థ ఓటర్లను తమ వైపు తిప్పుకోవడంలో ఈ కూటమి ఎంతవరకు సఫలమవుతుందనేది బెంగాల్ భవిష్యత్తును నిర్ణయించనుంది. ఒకవేళ వీరు గణనీయమైన స్థానాలు సాధిస్తే, అది బెంగాల్ రాజకీయాల్లో మమతా శకానికి ముగింపు పలికే తొలి అడుగు అవుతుందని అనుకోవచ్చు. మరో వైపు ఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై ప్రవేశపెట్టిన తీర్మానం నోటీసులో విపక్షాలు ఏడు ప్రధాన ఆరోపణలు చేసినట్టు తెలుస్తోంది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి పక్షపాత నిర్ణయాలు తీసుకుంటున్నారని, అనుచిత ప్రవర్తన రుజువైందని, ఎన్నికల అవకతవకలపై విచారణను ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నారని, సామూహికంగా ఓటుహక్కును రద్దుచేశారని విపక్షాలు ఆరోపించాయి. కొన్ని పార్టీలకు అనుకూలంగా పక్షపాత వైఖరిని ప్రదర్శిస్తున్నారని కూడా నోటీసులో పేర్కొన్నాయి. తమ ఆరోపణలకు బలంచేకూర్చే పలు సుప్రీంకోర్టు తీర్పులను సైతం నోటీసులో ప్రస్తావించాయి. ఎస్ఐఆర్ ప్రక్రియలో కేంద్రంలోని అధికార పార్టీకి అనుకూలంగా సీఈసీ వ్యవహరిస్తున్నారని ఆరోపించాయి. రాజ్యాంగ నిబంధనల ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలోనే సీఈసీని తొలగించాల్సి ఉంటుంది. ఇందుకు లోక్‌సభలో 100 మంది, రాజ్యసభలో 50 మంది సంతకాలు అవసరం. స్పీకర్ నోటీసును అంగీకరిస్తే ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీ ఈ ఆరోపణలను పరిశీలిస్తుంది. ఆరోపణలు నిజమని తేలితే తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు. ఉభయసభల్లోనూ హాజరైన ఎంపీల్లో మూడింట రెండు వంతుల మెజారిటీ లభిస్తే తీర్మానం నెగ్గుతుంది.

## టీడీపీ కార్యక్రమాలకు పుట్టా మహేష్ దూరం!?



ఏలూరు, విజయవాడ, ,: ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ డ్రగ్స్ కేసులో పట్టుబడటంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు అత్యంత కఠినంగా స్పందించారు. పార్టీ క్రమశిక్షణ, నైతిక విలువల విషయంలో రాజీ పడే ప్రసక్తి లేదని స్పష్టం చేస్తూ, ఈ వ్యవహారంపై సమగ్ర నివేదిక సమర్పించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును ఆదేశించారు. ఒక బాధ్యతాయుతమైన పదవిలో ఉండి ఇలాంటి ఆరోపణలు రావడం పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తుందని ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు పార్టీ అధిష్టానం తక్షణమే రంగంలోకి దిగింది. ఎంపీ పుట్టా మహేష్‌ను పార్టీ కార్యక్రమాలన్నింటికీ తక్షణమే దూరం పెడుతున్నట్లు ప్రకటించింది. రాజకీయాలకు అతీతంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రభుత్వం కృషి చేస్తున్న తరుణంలో, సొంత పార్టీ ఎంపీపైనే ఇలాంటి ఆరోపణలు రావడంతో అధిష్టానం ఈ కఠిన నిర్ణయం తీసుకుంది. కేసు విచారణ పూర్తయ్యే వరకు ఆయన పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిషేధం విధించినట్లు సమాచారం. అంతేకాకుండా, ఈ ఘటనపై వివరణ కోరుతూ పుట్టా మహేష్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని పల్లా శ్రీనివాసరావును చంద్రబాబు ఆదేశించారు. నిర్దేశిత సమయంలోగా తనపై వచ్చిన ఆరోపణలపై తగిన వివరణ ఇవ్వాలని, ఒకవేళ అది సంతృప్తికరంగా లేకపోతే తదుపరి చర్యలు ఉంటాయని పార్టీ వర్గాలు హెచ్చరించాయి. సీనియర్ నేత యనమల రామకృష్ణుడు అల్లుడు అయినప్పటికీ, పార్టీ నిబంధనల విషయంలో ఎవరికీ మినహాయింపు ఉండదని చంద్రబాబు ఈ చర్య ద్వారా సంకేతాలు పంపారు. ఎంపీ వివరణ అనంతరం పార్టీ ఇంకా కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అంతా పొలిటికల్ ఫ్యామిలీ...: గ్స్ కేసులో పట్టుబడ్డ పుట్టా మహేష్ వారసత్వమే అర్హతగా రాజకీయాల్లోకి వచ్చారు. ఆయనకు ఎంపీగా టిక్కెట్ కేటాయించడంలో బలమైన రాజకీయ వారసత్వం, సీనియర్ నేతల అండదండలు కీలక పాత్ర పోషించాయి. ఆయన తండ్రి పుట్టా సుధాకర్ యాదవ్ తెలుగుదేశం పార్టీలో సీనియర్ నేతగా, టీటీడీ మాజీ ఛైర్మన్‌గా పనిచేయడం మహేష్‌కు రాజకీయ ఓనమాలు నేర్పింది. ప్రస్తుతం ఆయన మైదుకూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. మహేష్ కుమార్ కేవలం తన తండ్రి వారసుడిగానే కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో దిగ్గజ నేతగా పేరొందిన యనమల రామకృష్ణుడికి అల్లుడు కావడం ఆయన రాజకీయ బలాన్ని రెట్టింపు చేసింది. యనమల వంటి వ్యూహకర్త కుటుంబంతో బంధుత్వం ఉండటం వల్ల పార్టీ అధిష్టానం వద్ద మహేష్‌కు ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈ సమీకరణాల వల్లే యువకుడైనప్పటికీ, 2024 ఎన్నికల్లో ఏలూరు వంటి కీలకమైన పార్లమెంట్ స్థానం నుండి పోటీ చేసే అవకాశం ఆయనకు దక్కింది. మహేష్ కుమార్ భార్య యనమల దివ్య కూడా ప్రస్తుతం తుని ఎమ్మెల్యేగా ఉన్నారు.

అదే సమయంలో తెలంగాణలోని బలమైన యాదవ సామాజిక వర్గ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబంతో ఉన్న వియ్యం కూడా మహేష్‌కు అదనపు బలాన్ని చేకూర్చింది. మహేష్ కుమార్ సోదరిని తలసాని కుమారుడు సాయికిరణ్ వివాహం చేసుకున్నారు. ఇలా రెండు రాష్ట్రాల్లోని ముగ్గురు సీనియర్ నేతల నీడలో మహేష్ రాజకీయం సాగుతోంది. ఈ భారీ రాజకీయ నేపథ్యం వల్లే ఆయనకు అనతి కాలంలోనే ఎంపీగా ఎదిగే అవకాశాలు వచ్చాయి. అయితే ఇప్పుడు డ్రగ్స్ కేసులో ఇరుక్కుని ఆయన తీవ్ర వివాదాస్పదం అయ్యారు. కొద్దిరోజులకు ఆయన కేసు నుంచి బయటపడతారేమో కానీ రాజకీయంగా మరోసారి అవకాశాలు రావడం మాత్రం కష్టమని అనుకోవచ్చు.

## ఫేజ్ 1కు 7వేల కోట్ల అంచనా..!

హైదరాబాద్: మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ నదిపై తొమ్మిది వంతెనలను నిర్మిస్తుంది. ఇప్పటికే ఉన్న ఐదు వంతెనల ను అప్‌గ్రేడ్ చేస్తుంది. అలాగే ప్రణాళిక ఫేజ్ 1లో భాగంగా మూడు నీటి నిలుపుదల బ్యారేజీలను నిర్మిస్తుందని మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వివరణాత్మక ప్రాజెక్టు నివేదికలో పేర్కొంది. ఫ్రంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఈవీ నరసింహ రెడ్డి సమర్పించిన ప్రతిపాదనలు.. ఓఆర్ఆర్ పరిమితుల్లోని నది ప్రతిపాదిత 55 కిలోమీటర్ల విస్తీర్ణంలో 21 కిలోమీటర్లను రెండు జోన్ లుగా విభజించాయి. కొన్ని నిర్మాణాలు తక్కువ ఎత్తులో ఉన్న కాజ్‌వేలు అని, వీటిని పైకి ఎత్తాల్సిన అవసరం ఉందని, దానిని కూడా ప్రాజెక్ట్ కింద తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఉస్మాన్‌సాగర్ నుండి తూర్పు వైపు ఉత్తర ఒడ్డున ఉన్న జోన్ 1బీ, కొత్త నిర్మాణాలలో ఎక్కువ భాగాన్ని కలిగి ఉంది. ఇందులో ఆరు వంతెనలు ఉన్నాయి. గండిపేట వంతెన రిజర్వాయర్ అంచున నిర్మిస్తారు. గోశాల నుండి గ్రేహౌండ్స్‌కు క్రాసింగ్ వంతెన, నర్సింగ్గి వద్ద ఓఆర్ఆర్‌పై వంతెన, జోన్ మధ్య భాగంలో బైరాగిగూడ వంతెన, రామ్‌దేవ్‌గూడ వంతెన, మూసా సమీపంలోని గాంధీ సరోవర్ వద్ద వంతెన పనులు జరుగుతున్నాయి. జోన్ 1ః లోని రెండు వంతెనలను అప్‌గ్రేడేషన్ కోసం ప్రతిపాదించారు: ఒకటి మంచిరేవుల వద్ద మరియు మరొకటి ఇబ్రహీం చెరువు వద్ద, ఇవి తక్కువ ఎత్తులో ఉన్న కాజ్‌వేలు. హిమాయత్‌సాగర్ వైపున ఉన్న దక్షిణ కారిడార్ అయిన జోన్ 1ం లో, దిగువ ఖీఖీ స్ట్రెచ్ వెంబడి బుద్వేల్ వద్ద, మధ్య జోన్ వద్ద గాంధీ సరోవర్ వద్ద, ఈ కారిడార్ తూర్పు చివరన బాపు ఘాట్ సమీపంలో కొత్త వంతెనలు ప్రతిపాదించారు. జోన్ 1ఏ లోని మూడు వంతెనలు అప్‌గ్రేడేషన్ కోసం నిర్ణయించారు. ఇందులో వెస్ట్ సైడ్ ఓఆర్ఆర్ వంతెన, ఉప్పర్‌పల్లి, కిస్మత్‌పూర్ వద్ద నిర్మాణాలు ఉన్నాయి. ఈ వంతెనలు వాహన, మల్టీమోడల్, పాదచారుల రాకపోకలను తీసుకెళ్లడానికి రూపొందించారు. డీపీఆర్ కారిడార్ అంతటా వర్తించే ఒకే ప్రామాణిక డిజైన్ కంటే వివిధ క్రాసింగ్‌లకు సరిపోయే వంతెన రకాల కలయికను వివరిస్తుంది. వంతెనల నుండి వేరుగా మూడు నీటి నిలుపుదల బ్యారేజీలను కూడా ప్రతిపాదిం చారు. ఈ బ్యారేజీలు ఏడాది పొడవునా నీటిని నిలుపుకునేలా రూపొందించారు. 'ఈ నది వెంట నీరు ఎల్లప్పుడూ ఉంటుంది. ఇది పర్యాటకాన్ని మెరుగుపరుస్తుంది, ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తుంది, కార్యకలాపాలను మెరుగుపరుస్తుంది. ఈ ప్రత్యేక ప్రాంతంలోని ప్రతిదానినీ పెంచుతుంది.' అని నరసింహ రెడ్డి అన్నారు. ఈ బ్యారేజీలు వంతెన నెట్‌వర్క్ పక్కన పనిచేయడానికి ఉంచారు. ఒకటి కిస్మత్‌పూర్-బుద్వేల్ స్ట్రెచ్ వద్ద, మరొకటి జోన్ 1ఏ లోని బాపు ఘాట్ వంతెన దగ్గర ఉంటాయి. జోన్ 1బీలో ఇది మంచిరేవుల వంతెన దగ్గర ప్రతిపాదించారు. 21 కిలోమీటర్ల ఫేజ్ 1 స్ట్రెచ్ అన్ని భాగాలలో మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.6,500 కోట్ల నుండి రూ.7,000 కోట్ల వరకు ఉంటుందని అంచనా

## గిట్టుబాటులేక.. ఫ్రీగా టమాట..

మెదక్: మాట రేట్లు దారుణంగా పడిపోవడంతో.. ఓ రైతు కీలక నిర్ణయం తీసుకున్నాడు. టమాటా పంటను మార్కెట్‌కు తీసుకురాగా.. అక్కడ గిట్టుబాటు ధర లేకపోవడంతో.. అక్కడికి వచ్చిన ప్రజలకు ఉచితంగా తన టమాట పంటను మొత్తం పంచిపెట్టాడు. ఫ్రీగా టమాటలు ఇస్తున్నారనే విషయం తెలియడంతో స్థానికులు ఒక్కసారిగా ఎగబడ్డారు. పండించిన పంటకు ధర లేకపోవడం పట్ల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరికొందరు రైతులు టమాటలను కోయకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. ప్రస్తుతం టమాటకు ధర లేక రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. భారీగా పెట్టుబడి పెట్టి టమాట పంటను పండించి.. కోసి మార్కెట్‌కు తీసుకువస్తే.. కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు.. వినియోగదా రులకు మాత్రం టమాట అంత తక్కువ ధరకు దొరకడం లేదు. మధ్యలో ఉన్న దళారులే టమాటపై భారీగా లాభాలు పొందుతున్నారు. అటు రైతులు, ఇటు వినియోగదారులకు లాభాలు లేకుండా.. దళారులే కొట్టేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆరుగాలం కష్టపడి పంట పండించిన రైతులు.. టమాటను మార్కెట్‌కు తీసుకువ చ్చి ధర లేక పారబోయడం, కనీసం మార్కెట్ ఖర్చులు కూడా రాకుండా బాధపడటం చూస్తూనే ఉన్నాం. ఈ నేపథ్యంలోనే తాజాగా ఓ రైతు.. తాను పండించిన టమాట పంటను తీసుకుని మహబూబా బాద్ జిల్లా కొత్తగూడ మార్కెట్‌కు వచ్చాడు. అయితే కిలో టమాటకు దళారులు కేవలం రూ.5 మాత్రమే చెల్లిస్తుండడంతో తీవ్ర అసహ నానికి గురయ్యాడు. కొత్తగూడలో సంత కావడంతో గూడూరు మండ లం భూపతిపేట గ్రామానికి చెందిన ఒక రైతు ఆటోలో టమాటాలను తీసుకొచ్చాడు. అయితే టమాట పంటను కొనుగోలు చేసేందుకు అక్కడ వ్యాపారులు ఎవరూ ముందుకు రాలేదు. దీంతో తమ గ్రామం నుంచి అంతదూరం ఆటోలో టమాట పంటను తీసుకొచ్చిన ఆ రైతు.. మళ్లీ తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక అక్కడే ఉచితంగా పంచిపె ట్టాడు. తాను తీసుకొచ్చిన



ఆటోలో టమాటాలను ఓపెన్ చేసి.. అక్కడికి వచ్చిన వారికి ఫ్రీగా ఇచ్చేశాడు. దీంతో ఫ్రీగా టమాటాలు వస్తుండటంతో స్థానికులు భారీగా ఎగబడ్డారు. ప్రస్తుతం మార్కెట్‌లో టమాటలకు ధర లేకపోవడంతో టమాట పండించిన రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పెట్టిన పెట్టుబడి పక్కన పెడితే.. కనీసం వాటిని తెంచడానికి అయిన కూలీల ఖర్చు, మార్కెట్‌కు తీసుకొచ్చిన ఖర్చులు కూడా రావడం లేదని.. తమ చేతి నుంచే ఎదురు ఖర్చులు చేయాల్సి వస్తోందని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో టమాటకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని రైతులు వేడుకుంటున్నారు. మరికొందరు రైతులు టమాట పంట పండినా.. ధర లేకపోవడంతో.. వాటిని తెంపితే కూలీల ఖర్చు అవుతుందని.. వాటిని అమ్మినా ఆ ఖర్చులు కూడా రావని భావించి.. పొలాల్లోనే అలాగే వదిలేస్తున్నారు. మరికొందరు రైతులు పశువులకు మేతగా టమాటలను వేస్తున్నారు. ఇంకొందరు రైతులు.. తమ పొలాల్లోకి వచ్చి ఎవరైనా ఫ్రీగా కోసుకుని వెళ్లొచ్చని ఆఫర్లు ఇస్తున్నారు. వేలకు వేల రూపాయలు పెట్టుబడి పెట్టి టమాట పంటను సాగుచేస్తే.. పంట చేతికి వచ్చిన తర్వాత రేటు దారుణంగా పడిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు. బయట కూరగాయల మార్కెట్లో మాత్రం వినియోగదారులకు కిలో టమాటా రూ.20 కి తక్కువకు దొరకకపోవడం గమనార్హం.


## స్కానింగ్ సెంటర్ లలో ఆకస్మిక తనిఖీ

### జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి

జగిత్యాల ప్రతినిధి: జగిత్యాల లోని పలు స్కానింగ్ సెంటర్లనుమాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం జైపాల్ రెడ్డి ఆకస్మికం గా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం1994 ప్రకారం లింగ నిర్ధారణ చేసి ఆడ ,మగ అని చెప్పడం చట్టరీత్యా నేరమని, స్కానింగ్ సెంటర్లలో స్కానింగ్ మిషన్స్ మరియు డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని నిర్ధారించుకున్నారు. ఫారంఎఫ్ లు ప్రతినెల 5వ తారీఖు లోపు వారికి కేటాయించబడిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రశీ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలలో సబ్మిట్ చేయవలసిందిగా ఆదేశిం చారు. ఫారంఎఫ్ లు ఆన్లైన్లో, ఆఫ్లైన్లో ఒకే విధంగా ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు పేషంట్లకు కనపడే విధంగా ఇక్కడ లింగనిర్ధారణ చేయబడదు - లింగ నిర్ధారణ చేసినచో కఠినచర్యలు తీసుకోబడతాయి అను ఫ్లెక్సీ బోర్డులు , ఫోం బోర్డులు ఏర్పాటు చేయవలెనని డాక్టర్ జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ నిబంధనలు అతిక్రమించిలింగ నిర్ధారణ చేసినచోజరిమానా విధించబ డడమే కాకుండా గర్భిణీమినహా ప్రోత్సహించినవారిపైకూడా జరిమా నా మరియు మూడు నెలల జైలు శిక్ష కూడా ఉంటుందని, వైద్యుల యొక్క రిజిస్ట్రేషన్ కూడా రద్దుపరుచబడతాయని తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారికి నోటీసులు జారీ చేయబడతాయన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి రాజేశంలు పాల్గొన్నారు.

## తెలంగాణలో కొత్త ఎయిర్‌పోర్టు..

వరంగల్, : వరంగల్ నగర ప్రజలకు గుడ్‌న్యూస్. త్వరలోనే మామునూరు ఎయిర్‌పోర్టు అందుబాటులోకి రానుంది. ఎయిర్ కనెక్టివిటీ కోసం హైదరాబాద్ రావాల్సిన పని లేకుండా నగరం నుంచే రాకపోకలు సాగించొచ్చు. ఈ మేరకు ఎయిర్‌పోర్టు డీపీఆర్ సిద్ధం కాగా.. త్వరలోనే కేంద్రం ఆమోదముద్ర వేయనుంది. ఆ తర్వాత ఏడాదిలోగా ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. తెలంగాణలో ప్రస్తుతం శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు ఒక్కటే పౌరులకు సేవలందిస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ఎయిర్ కనెక్టివిటీ పెంచాలనే లక్ష్యంతో కొత్తగా మరో నాలుగు ఎయిర్‌పోర్టులు ప్రతిపాదించారు. వరంగల్ మామునూరు, రామగుండం, పెద్దపల్లి, కొత్తగూడెంలలో కొత్తగా ఎయిర్‌పోర్టుల నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధమయ్యాయి. ఇందులో వరంగల్ మామునూరు విమానాశ్రయం పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఏడాదిలోగా అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు పనులు జరుగుతున్నాయి. ప్రస్తుతం ఈ ఎయిర్‌పోర్టు డీపీఆర్ సిద్ధంగా కాగా.. అది కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉంది. కొద్ది రోజుల్లోనే డీపీఆర్‌కు ఆమోదం లభించే ఛాన్స్ ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. ఆపై ఏడాదిలో పనులు పూర్తి చేసి ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తెచ్చేందుకు ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రణాళికలు రెడీ చేస్తోంది. ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి పెద్ద పెద్ద విమానాలు ఈజీగా ల్యాండ్ అయ్యేలా రన్‌వేను మూడు కి.మీ.మేర పొడిగిస్తారు. ప్రయాణికుల టెర్మినల్, కార్గో సౌకర్యం, సెక్యూరిటీ వ్యవస్థలు, పార్కింగ్, అనుసంధాన మార్గాలు వంటివి ఎయిర్‌పోర్టులో నిర్మిస్తారు. ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి అవసరమైన భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పూర్తి




చేసింది. సుమారు 950 ఎకరాల భూమిని ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం కేటాయించారు. ఈ భూమికి అదనంగా మరో 253 ఎకరాలు సేకరించి ఎయిర్‌పోర్టు అథారిటీకి అప్పగించారు. మామునూరు ఎయిర్‌పోర్ట్ ప్రస్తుతం చిన్న ఎయిర్‌స్ట్రిప్‌గా ఉంది. దీన్ని పూర్తిస్థాయి కమర్షియల్ ఎయిర్‌పోర్ట్‌గా మార్చడంతో వరంగల్ ప్రాంతం అభివృద్ధిలో దూసుకెళ్లనుందని నిపుణులు చెబుతున్నారు. ఎయిర్ కనెక్టివిటీ కోసం హైదరాబాద్ నగరం వెళ్లాల్సిన లేకుండా ఇక్కడి నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు చేరుకోవచ్చునని అంటున్నారు. పరిశ్రమలు, ఐటీ కంపెనీలు వరంగల్ నగరానికి క్యూ కడతాయని చెబుతున్నారు. టూరిజం పెరుగుతుందని.. రామప్ప ఆలయం, వేయిస్తంభాల గుడి, వరంగల్ కోట వంటి ప్రదేశాలు సందర్శించే విదేశీ పర్యాటకులు పెరుగుతారని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. మొదట చిన్న, మధ్యస్థాయి విమానాలతో రాకపోకలు ప్రారంభిస్తారని.. ఆ తర్వాత రోజుకు 1-2 విమానాలు రాకపోకలు సాగిస్తాయని అంటున్నారు. ప్రధానం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబై వంటి నగరాలకు కనెక్టివిటీ పెరుగుతుందని చెబుతున్నారు.

## మరోమారు భగ్గుమన్న పసిడి ధర

### సగటున పది గ్రాములపై 1200 పెరుగుదల

న్యూఢిల్లీ: గత కొంతకాలంగా తగ్గుతూ వస్తున్న పసిడి ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. దేశంలో మేలిమి బంగారం ధర సగటున రూ.1200ల మేర పెరిగింది. వెండి ధర కూడా సగటున రూ.5 వేల మేర ఎగబాకింది. ధరలు దిగివచ్చినప్పుడు వందల్లో దిగుతూ.. పెరిగితే వేలల్లో పెరగడం గమనార్హం. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, మంగళవారం ఉదయం 10.00 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,58,620లకు ఎగబాకింది. నిన్నటి ముగింపుతో పోలిస్తే రూ.1200ల మేర పెరిగింది. ఇక 22 క్యారెట్ ఆర్నమెంటల్ పసిడి ధర కూడా రూ.1100ల మేర పెరిగి రూ.1,45,400కు చేరుకుంది. నగరంలో వెండి ధర రూ.4 వేల మేర పెరిగింది. కిలో వెండి ప్రస్తుతం రూ.2.8 లక్షలు పలుకుతోంది. ఇక చెన్నైలో 24 క్యారెట్ 10 గ్రాముల పసిడి ధర రూ.1,59,820గా ఉంది. ఢిల్లీలో రూ.1,58,770 వద్ద కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా, బెంగళూరు నగరాల్లో 10 గ్రాముల 24 క్యారెట్ పసిడి ధర రూ.1,58,620గా ఉంది. ఇక 22 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర చెన్నైలో రూ.1,46,500గా, ఢిల్లీలో రూ.1,45,550గా ఉంది. ముంబై, ఢిల్లీ, కోల్‌కతా నగరాల్లో రూ.1,45,400గా ఉంది. చెన్నైలో కిలో వెండి రూ.2.8 లక్షలకు చేరుకోగా ఇతర ప్రధాన నగరాల్లో రూ.2.75 లక్షల వద్ద కొనసాగుతోంది.



# ఆలుగడ్డలను ఈ విధంగా మాత్రం తినకండి..

ఆలుగడ్డలను సహజంగానే చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. వీటితో వేపుడు చేస్తే ఎంతో రుచిగా ఉంటుంది. అలాగే కుర్మా, టమాటా కూర కూడా చేసి తినవచ్చు. ఆలుతో చిప్స్‌ను కూడా తయారు చేసి తింటారు. ఇవి కూడా ఎంతో రుచిగా ఉంటాయి. కానీ ఆలును వేపుళ్లు, చిప్స్ లాంటి రూపంలో తింటే మనకు జరిగే మేలు ఏమీ ఉండదు. కానీ నష్టం మాత్రం అధికంగా ఉంటుంది. అదే ఆలుగడ్డలను ఉడకబెట్టి లేదా కూరగా చేసి తింటేనే మనకు లాభం ఉంటుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఆలుగడ్డ ల్లో మన శరీరానికి కావల్సిన పలు ముఖ్యమైన పోషకాలు ఉంటాయి. ఆలుగడ్డల్లో పిండి పదార్థాలు అధికంగా ఉంటాయి. కనుక ఇవి మనకు శక్తిని అందిస్తాయి. ఒక మీడియం సైజు ఆలుగడ్డలో సుమారుగా 26 గ్రాముల మేర పిండి పదార్థాలు ఉంటాయి.

**క్యాన్సర్ రాకుండా..:** ఆలుగడ్డను పిండి పదార్థాలకు మంచి నెలవుగా చెప్పవచ్చు. ఇది శరీరానికి కావల్సిన శక్తిని అందిస్తుంది. కానీ అధికంగా తింటే మాత్రం బరువు పెరిగే అవకాశం ఉంటుంది. శారీరక శ్రమ లేదా వ్యాయామం ఎక్కువగా చేసేవారికి కావల్సిన శక్తిని ఆలుగడ్డలు అందిస్తాయి. కనుక వారు రోజూ వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే మంచిది. అలాగే ఆలుగడ్డలో ఉండే పలు సమ్మేళనాలు పెద్ద పేగు క్యాన్సర్ రాకుండా రక్షిస్తాయి. పెద్ద పేగును ఆరోగ్యంగా ఉంచుతాయి. ఆలుగడ్డలను మోతాదులో తింటుంటే కొలెస్ట్రాల్ లెవల్స్ తగ్గుతాయి. ట్రై గ్లిజరైడ్స్ స్థాయిలను నియంత్రణలో ఉంచవచ్చు. ఆలుగడ్డలను ఎల్లప్పుడూ ఉడకబెట్టి మాత్రమే తినాలి. వేయించి లేదా పచ్చిగా తినకూడదు. ఇవి సరిగ్గా జీర్ణం కావు.

**పోషకాలు అధికంగా..:** 150 గ్రాముల మేర ఆలుగడ్డలను తింటే

## లాభం కలగదు సరికదా, తీవ్రంగా నష్టం ఉంటుంది..

27 మిల్లీగ్రాముల విటమిన్ సి లభిస్తుంది. మనకు రోజుకు కావల్సిన విటమిన్ సి లో ఇది 45 శాతం. అలాగే 630 మిల్లీగ్రాముల మేర పొటాషియం, 0.2 మిల్లీగ్రాముల విటమిన్ బి6, స్వల్ప మోతాదులో థయామిన్, రైబోఫ్లేవిన్, ఫోలేట్, నియాసిన్, మెగ్నిషియం, ఐరన్, జింక్ తదితర పోషకాలు వీటి ద్వారా లభిస్తాయి. ఆలుగడ్డలను పైన పొట్టుతో తింటే మేలు. చాలా మంది పొట్టు తీసేసి తింటారు. దీని వల్ల అనేక పోషకాలను, ముఖ్యంగా ఫైబర్‌ను కోల్పోవాల్సి వస్తుంది. ఆలుగడ్డలను బాగా కడిగి తొక్కతో సహా ఉడకబెట్టి తింటే మేలు జరుగుతుంది. ఆలుగడ్డల్లో కార్టినాయిడ్స్, పాలిఫినాల్స్ అధికంగా ఉంటాయి. ఇవి క్యాన్సర్ ప్రమాదాన్ని చాలా వరకు తగ్గిస్తాయి.


**అందానికి కూడా..:** ఆలుగడ్డలు కేవలం ఆరోగ్య ప్రయోజనాలు అందించడమే కాదు, అందానికి కూడా పనిచేస్తాయి. ఆలుగడ్డలను గుజ్జుగా చేసి ముఖానికి ఫేస్ ప్యాక్‌లా ఉపయోగించవచ్చు. దాన్నే జుట్టుకు రాసి హెయిర్ ప్యాక్‌లా వాడవచ్చు. దీంతో చర్మం, శిరోజాలు ఆరోగ్యంగా ఉంటాయి. చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. ముఖంపై ఉండే ముడతలు, మచ్చలు పోతాయి. అలాగే జుట్టు రాలడం తగ్గుతుంది. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. ఆలుగడ్డలను కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి అనంతరం వాటిని తీసి చక్రాల్లా అడ్డంగా కట్ చేయాలి. ఆ ముక్కలను కళ్లపై 15 నిమిషాల పాటు పెట్టుకోవాలి. తరచూ ఇలా చేస్తుంటే కళ్ల కింద ఉండే డార్క్ సర్కిల్స్ మాయం అవుతాయి. ఆలుగడ్డల్లో ఉండే విటమిన్ సి రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. వ్యాధులు రాకుండా రక్షిస్తుంది. వీటిల్లో ఉండే పొటాషియం రక్త సరఫరాను మెరుగు పరిచి గుండెను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఆలుగడ్డలు ఆరోగ్యానికి ప్రయోజనకరమే అయినప్పటికీ వీటిని అధికంగా తినకూడదు. అధిక బరువు ఉన్నవారు, డయాబెటిస్ ఉన్నవారు డాక్టర్ సూచన మేరకు వీటిని తినాలి.

# కోలన్ క్యాన్సర్ కారకాలు



మనిషిని దీర్ఘకాలంపాటు పట్టి పీడించే వ్యాధుల్లో క్యాన్సర్ ప్రధానమైనది. క్యాన్సర్లలో పెద్దపేగు (కోలన్) క్యాన్సర్ ఒకటి. అయితే, మనలో చాలామందికి కోలన్ క్యాన్సర్ ముప్పును పెంచే జీవనశైలి అలవాట్ల గురించి అంతగా తెలియదని ఓహియో స్టేట్ యూనివర్సిటీ జరిపిన అధ్యయనంలో వెల్లడైంది. ఊబకాయం, మద్యపానం, తగినంత శారీరక శ్రమ లేకపోవడం, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం, ప్రాసెస్డ్ ఆహార పదార్థాలు పెద్దపేగు క్యాన్సర్‌కు దోహదపడతాయి. కాబట్టి, దీనికి సంబంధించి అనుమానంగా అనిపించినా, డాక్టర్లు అవసరమని చెప్పినా.. 45 ఏండ్లు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా కొలనోస్కోపీ చేయించుకోవడం మంచిదట. వీలైతే ఇంకా ముందే మేల్కోవాలని పరిశోధకులు సూచించారు.

# ఏ వైపు మంచిది?



చక్కటి ఆరోగ్యానికి చిక్కటి నిద్ర ఎంతో అవసరం. లేకుంటే.. అనారోగ్యాల పాలవ్వడం ఖాయం! ఈ విషయంలో నిద్ర ఒక్కటే కాదు.. నిద్రపోయే భంగిమ కూడా ఎంతో కీలకం. అందులోనూ ఎడమవైపు తిరిగి పడుకుంటే.. ఎంతో ప్రయోజనకరం.

రకరకాల మనుషులు.. రకరకాలుగా నిద్రిస్తుంటారు. కొందరు వెల్లకిలా పడుకుంటే.. మరికొందరు బోర్లా పడుకుంటారు. కొందరు కుడివైపు వాలితే.. ఇంకొందరు ఎడమవైపునకు ఒరుగుతుంటారు. వీటన్నిట్లోకి.. ఎడమవైపు తిరిగి పడుకోవడమే ఆరోగ్యానికి ఎంతో మేలని అంటున్నారు నిపుణులు.

. ఇలా పడుకోవడం వల్ల భవిష్యత్తులోనూ ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని చెబుతున్నారు. ఎడమవైపు తిరిగి పడుకోవడం గుండెకు ఎంతో మేలుచేస్తుంది. గుండె ఎడమ వైపునే ఉంటుంది కాబట్టి, అదే దిశలో పడుకుంటే గురుత్వాకర్షణ వల్ల ఎలాంటి ఇబ్బందుల్లేకుండా గుండెకు రక్త సరఫరా అవుతుంది. ఫలితంగా గుండెపై ఒత్తిడి తగ్గిపోతుంది.

గురక సమస్య తగ్గాలంటే.. ఎడమవైపు తిరిగి పడుకోండి. శ్వాస తీసుకోవడం కూడా సులభం అవుతుంది. ఎడమవైపు తిరిగి పడుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యం మెరుగుపడుతుంది. తిన్న ఆహారం జీర్ణం కాగా, మిగిలిన వ్యర్థాలు, టాక్సిన్లన్నీ పేగుల్లోనే ఉండిపోతాయి. కుడివైపు కన్నా ఎడమవైపు తిరిగి పడుకున్నప్పుడే.. అవన్నీ సులభంగా కిందికి వెళ్లిపోతాయి. ఇక ఎడమ వైపు తిరిగి పడుకోవడం వల్ల.. వీపు, నడుము, వెన్నెముకపై ఒత్తిడి తగ్గుతుంది. మంచి నిద్ర పడుతుంది. ముఖ్యంగా.. గర్భిణులు ఇలా పడుకోవడం వల్ల పిండానికి రక్త ప్రసరణ మెరుగవుతుంది. ఆరోగ్యానికి ఎంత మంచిదైనా.. ఎప్పుడూ ఒకే వైపు తిరిగి పడుకోలేం. అందుకే కాసేపు కుడివైపు, వెల్లకిలా పడుకున్నా.. వీలైనంత ఎక్కువ సమయం ఎడమ వైపు తిరిగి పడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

## రోజూ ఒక గ్లాస్ మజ్జిగను సేవిస్తే..

# ఇన్ని లాభాలు కలుగుతాయా..?



సాధారణంగా చాలా మంది పెరుగును ఇష్టంగా తింటుంటారు. కానీ మజ్జిగను మాత్రం తీసుకోరు. అందులో నీటి శాతం అధికంగా ఉంటుందని చెప్పి మజ్జిగను సేవించేందుకు అంతగా ఇష్టపడరు. అయితే పెరుగు కన్నా మజ్జిగనే ఎక్కువ ఆరోగ్యకరమైందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. మన శరీరంలోని వేడిని తగ్గించేందుకు రెండూ ఉపయోగకరమైనవే. కానీ మజ్జిగలో కొవ్వు శాతం చాలా తక్కువగా ఉంటుంది. కనుక ఇది మనకు ఇంకా ఎక్కువ మేలు చేస్తుందని అంటున్నారు. ఇక వేసవి కాలంలో రోజూ ఒక గ్లాస్ మజ్జిగను మధ్యాహ్నం సమయంలో తాగితే ఎంతో మేలు జరుగుతుం ది. మజ్జిగ మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. మజ్జిగను రోజూ సేవించడం వల్ల అనేక పోషకాలు లభిస్తాయి.

**జీర్ణ వ్యవస్థ పనితీరుకు..:** మజ్జిగ ప్రొ బయోటిక్ ఆహారాల జాబితాకు చెందినది. అందువల్ల మజ్జిగను రోజూ తాగితే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా పెరుగుతుంది.

ఇది జీర్ణక్రియను మెరుగు పరుస్తుంది. తిన్న ఆహారం సరిగ్గా జీర్ణంఅయ్యేలా చేస్తుంది.కడుపుఉబ్బరం, అసిడి టీ, గ్యాస్‌సమస్యల నుంచి ఉపశమనంలభిస్తుంది.మలబద్ధకం తగ్గు తుంది. మజ్జిగలోక్యాల్షియం సమృద్ధిగాఉంటుంది.అందువల్ల మజ్జిగ ను రోజూ సేవిస్తే ఎముకలు, దంతాలు దృఢంగా, ఆరోగ్యంగా ఉంటాయి. మజ్జిగలో లాక్టిక్ యాసిడ్‌ఉంటుంది.ఇది శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. దీంతో శరీరం రోగాలు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. వ్యాధుల నుంచి రక్షణను అందిస్తుంది.

**బరువు తగ్గేందుకు..:** అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి మజ్జిగ మంచి ఆహారం అని చెప్పవచ్చు. మజ్జిగలో ప్రోటీన్లు ఎక్కువగా, కొవ్వు తక్కువగా ఉంటాయి. పెరుగుతో పోలిస్తే మజ్జిగలో కొవ్వు చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునే వారికి మంచి ఆహారం అని చెప్పవచ్చు. దీన్ని తాగితే ఎక్కువ సేపు ఉన్నా కడుపు నిండిన భావనతో ఉంటారు. ఆకలి వేయదు. దీంతో ఆహార్ తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. మజ్జిగను తాగడం వల్ల వేసవిలో శరీరం కోల్పోయిన ఎలక్ట్రోలైట్స్‌ను తిరిగి పొందవచ్చు. దీంతో వేసవి తాపం నుంచి ఉపశమనం లభిస్తుంది. శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటుంది. ఎండ దెబ్బ నుంచి సురక్షితంగా ఉండవచ్చు.

**గుండె ఆరోగ్యానికి..:** మజ్జిగలో అనేక ప్రోటీన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ లెవల్స్‌ను తగ్గిస్తాయి. దీని వల్ల గుండె ఆరోగ్యంగా ఉంటుంది. మజ్జిగలో ఉండే బయో యాక్టివ్ సమ్మేళనాలు శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తాయి. దీంతో బీపీ తగ్గుతుంది. హైబీపీ ఉన్నవారు మజ్జిగను సేవిస్తుంటే ప్రయోజనం ఉంటుంది. దీంతో గుండె కూడా ఆరోగ్యంగా ఉంటుంది. గుండె పోటు రాకుండా నివారించవచ్చు. మజ్జిగలో ఉండే రైబోఫ్లేవిన్ లివర్ పనితీరును మెరుగు పరుస్తుంది. దీంతో లివర్‌లో ఉండు వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. ఫ్యాటీ లివర్ సమస్య ఉన్నవారు రోజూ మజ్జిగను సేవిస్తుంటే ఫలితం ఉంటుంది. చర్మ సంరక్షణకు కూడా మజ్జిగ మేలు చేస్తుంది. మజ్జిగను సేవిస్తుంటే డ్యామేజ్ అయిన చర్మ కణాలు మరమ్మత్తులకు గురవుతాయి. దీంతో చర్మం కాంతివంతంగా మారి మృదువుగా ఉంటుంది. ఇలా మజ్జిగను రోజూ సేవిస్తే అనేక ప్రయోజనాలను పొందవచ్చు.

# మహిళలూ.. ఈ పోషకాలు అందేలా చూసుకోండి!




గృహిణులైనా, ఉద్యోగాలు చేసే మహిళలైనా ముందుగా వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఆరోగ్యాన్ని రక్షించటానికి సమతుల్య ఆహారం కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు తమ డైట్‌లో ఖచ్చితంగా పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. లేకపోతే అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారు. రుతుస్రావం నుంచి ప్రెగ్నెన్సీ, డెలివరీ, మెనోపాజ్ వరకూ ఇలా శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధకశక్తి తగ్గటం, ప్రెగ్నెన్సీ సంబంధిత రుగ్మతలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్, పాలీసిస్టోసిస్ వంటి సమస్యలతో ఎక్కువగా ఇబ్బందులు పడుతుంటారు. మహిళలు ఆరోగ్యంగా ఉండటానికి, వారి జీవన నాణ్యతను పెంపొందించుకోవటానికి, దీర్ఘాయువును పొందటానికి ఆహారం కీలకపాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

వయస్సు రీత్యా మహిళలకు శరీరంలో వచ్చే మార్పుల కారణంగా వారికి పలు రకాల విటమిన్లు అవసరమవుతాయి. మగవారితో పోలిస్తే మహిళ లకు ప్రత్యేకంగా కొన్ని విటమిన్లు అవసరమ వుతాయి. పెరుగుతున్న వయస్సుతోపాటు కొన్ని విటమిన్లు తప్పక తీసుకోవాలి. యునిసెఫ్ నివేదిక ప్రకారంలో ప్రపంచంలో 100 కోట్ల కంటే ఎక్కువ మంది మహిళలు, ఆడపిల్లలు రకరకాల విటమిన్లు, పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. ఈ లోపాలను అధిగమించటం కోసం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవాలి.

ఒత్తిళ్లకు దూరంగా ఉండాలి: చాలామంది మహిళలు తమ వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలను బ్యాలెన్స్ చేసుకోవటానికి ఇబ్బంది పడతారు. ఇది ఒత్తిడికి దారితీస్తుంది. మహిళలను ఎక్కువగా రక్తహీనత, నీరసం, అలసట, తలనొప్పి, రోగ నిరోధక శక్తి తగ్గడం, ప్రెగ్నెన్సీ సంబంధిత సమస్యలు, రొమ్ము క్యాన్సర్, ఆర్థరైటిస్, ఓవేరియన్ పాలీసిస్టోసిస్ వంటి ఆరోగ్య సమస్యలు వేధిస్తాయి. వారు తీసుకునే ఆహారమే వారి జీవన నాణ్యతను మెరుపర్చుకోవడానికి కీలకపాత్ర పోషిస్తుంది.

ఫోలెట్ : తమ రోజువారీ డైట్‌లో దీనిని ఖచ్చితంగా తీసుకోవాలి. ఇది గుండె ఆరోగ్యం, నరాల పనితీరు, చర్మ ఆరోగ్యం, జీర్ణక్రియ, రక్త ప్రసరణ, ఉత్పత్తిని మెరుగుపర్చటంలో సహాయపడుతుంది. గర్భధారణ సమయంలో దీనికి ఖచ్చితంగా తీసుకుంటే మేలని డాక్టర్లు చెబుతుంటారు. గర్భధారణ సమయంలో, మహిళలు ఫోలెట్ కచ్చితంగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తూ ఉంటారు. ఫోలిక్ యాసిడ్ గర్భంలోని పిండం ఎదుగుదలకు, అభివృద్ధికి అవసరమైన ముఖ్యమైన పోషకాల్లో ఒకటి. గర్భంలో శిశువు మెదడు, వెన్నుముక అభివృద్ధికి సహాయపడుతుంది. ఇది బ్రకోలీ, క్యాబేజీ, పాలకూర, తృణధాన్యాలు, చిక్కుళ్లు, శనగలు, రాజ్మా, కమల, కరివేపాకు, మెంతి, తోటకూర, గోరుచిక్కుడు, బెండకాయ, గుడ్డు, ఆవు పాలల్లో సమృద్ధిగా లభిస్తుంది.

కాల్షియం : ఎముకలు, దంతాలు బలంగా ఉండటానికి కీలక పాత్ర పోషిస్తుంది. మహిళలు వయస్సు పెరిగే కొద్దీ బోలు ఎముల వ్యాధి వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీని కారణంగా ఎముకలు పెళుసుగా, బలహీనంగా మారతాయి. ఇవి సమృద్ధిగా ఉండే పాలు, పెరుగు, చీజ్ వంటి డైరీ ఉత్పత్తులను తీసుకోవాలి. పాలకూర, ఆకుకూరల్లోనూ కాల్షియం అధికంగా ఉంటుంది.

ఐరన్ : డబ్ల్యుహెచ్ఒ నివేదిక ప్రకారం దాదాపు 40 మంది గర్భిణీస్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఐరన్‌లోపమే. ఫలితంగా అలసట, బలహీనత వేధిస్తాయి. అలసట, బలహీనత వేధిస్తాయి. పౌల్ట్రీ, షిష్, నువ్వులు, బెల్లం, బీన్స్ వంటి ఆహార పదార్థాలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది.

ఫైబర్ : ఫైబర్ బరువును నియంత్రించటానికి దోహదపడుతుంది. జీర్ణక్రియను ప్రోత్సహిస్తుంది. గుండె సమస్యలు, టైప్ 2 డయాబెటిక్ వంటి దీర్ఘకాలిక సమస్యల ముప్పును తగ్గిస్తుంది. తృణధాన్యాలు, పండ్లు, కూరగాయలు, చిక్కుళ్లు, నట్స్ వంటి ఆహారాలు తీసుకోవాలి.

పొటాషియం : ఇది ఒక ఎలక్ట్రోలైట్. రక్తపోటును నియంత్రణలో ఉంచుతుంది. ఆరోగ్యకరమైన కండరాలు, నరాల పనితీరుకు సహాయపడుతుంది. పొటాషియం హైపర్‌టెన్షన్, స్ట్రోక్ ముప్పును తగ్గిస్తుంది. రోజువారీ ఆహారంలో అరటి, కమల, బంగాళదుంపలు, పాలకూర, బీన్స్ వంటి పొటాషియం పుష్కలంగా ఉండే ఆహారాలను తీసుకోవాలి.

విటమిన్–ఎ : ఆడవాళ్ల ఆరోగ్యానికి విటమిన్–ఎ కీలకమైంది. ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఎముకలు, దంతాలు ఆరోగ్యంగా ఉండటానికి 'ఎ' విటమిన్ తీసుకోవటం అత్యంత అవసరం. దీనికోసం టమోటా, క్యారెట్, బొప్పాయి, గుమ్మడికాయ, పాలకూర, చేపలు, పాలు, గుడ్లు, పుచ్చకాయ వంటివి ప్రతిరోజూ తీసుకుంటుండాలి.

విటమిన్–సి : రోగ నిరోధక శక్తికి పెంపొందించుకోవటానికి తప్పకుండా రోజువారీ డైట్‌లో తీసుకోవాలి. ఇది రొమ్ము క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధిస్తుంది. గర్భిణులు, పాలిచ్చే తల్లుల ఆరోగ్యానికి ఇది ఎంతో అవసరం. ఇది సిట్రస్ ఫ్రూట్స్, బంగాళా దుంపలు, స్ట్రాబెర్రీస్, టమాటో, జామ, ఉసిరి వంటి వాటిలో లభిస్తుంది.

విటమిన్–డి : శరీరంలో కాల్షియం పెరుగుదలకు అవసరమైన 'డి' విటమిన్ మహిళల ఆరోగ్యానికి అత్యంత అవసరం. వయస్సుపైబడే కొద్దీ కీళ్ల అరుగుదల, కీళ్ల నొప్పులు వంటివి రాకుండా ఉండేందుకు విటమిన్–డి తీసుకోవటం అవసరం. ఇంటిపట్టునే ఉండే గృహిణుల్లో ఈ విటమిన్ ఎక్కువగా లోపిస్తుంది. అలాంటివాళ్లు రోజుకు కాసేపు ఎండలో ఉండటం అవసరం.

విటమిన్–బి3 : కణాల పనితీరు, పోషకాలను గ్రహించటంలో, నాడీ వ్యవస్థ పనితీరులో 'బి3' విటమిన్ కీలకం. ఇది ట్యూనా చేపలు, వేరుశెనగలు, పుట్టగొడుగులు, గోధుమలు, పాలు, గుడ్లు, బీన్స్ వంటి వాటిలో ఉంటుంది.

విటమిన్–బి6 : హార్మోన్ల ఉత్పత్తికి, మెదడు ఆరోగ్యానికి, రక్తహీనత వంటి సమస్యలను నివారించటానికి విటమిన్–బి6 అవసరం. దీనికోసం డ్రైఫ్రూట్స్, నట్స్, ఎగ్స్, ముడి ధాన్యాలు, బీన్స్, అరటిపండ్లు, మాంసం, ఓట్లు వంటివి తీసుకోవాలి.

విటమిన్–బి9 : ముఖ్యమైన విటమిన్లలో 'బి9' (ఫోలిక్ యాసిడ్) కూడా ఒకటి. ఇది గర్భిణుల ఆరోగ్యానికి మేలు చేస్తుంది. ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలను తగ్గిస్తుంది. ఇది ఆకుకూరలు, బీన్స్, పప్పు ధాన్యాలు, అరటిపండ్లు, చేపల్లో ఎక్కువగా ఉంటుంది.

విటమిన్–బి12 : మహిళల్లో రక్తహీనత తగ్గటానికి విటమిన్–బి12 తీసుకోవడం అవసరం. ఇది రక్త కణాలు ఏర్పడటానికి, మెటబాలిజం రేటును పెంచటానికి పెంచటానికి ఉపయోగపడుతుంది. ఇది చేపలు, పాలు, గుడ్డు, మాంసం, పెరుగు వంటి పదార్థాల్లో అధికం.

# కాసులు కురిపిస్తున్న ఎర్ర బంగారం



గుంటూరు, : తెలుగు రాష్ట్రాల్లో పండించే మిరప పంటకు ప్రపంచ స్థాయిలోగిరాకీ ఎక్కువే. నాణ్యతతోపాటు మంచి రంగు, రుచి, ఘాటు వీటికి ఉంటుంది. అయితే మిరప రైతులకు గిట్టుబాటు ధర దొరక్క యేటా అప్పుల ఊబిలో కూరుకుపోయి నష్టాలు చూసేవారు. దీంతో నష్టాల బాధలు భరించలేక చాలా మంది రైతులు మిరపను సాగుచేయలేమంటూ చేతులెత్తేశారు. ఇక మరికొంతమంది రైతులు చేస్తున్న సాగు విస్తీర్ణంను తగ్గించుని కొద్ది మొత్తంలో మాత్రమే మిరప పంటను పండిస్తున్నారు. అయితే ఈ ఏడాది మాత్రం మిరప పంట రైతులకు కనీవినని రీతిలో కాసులు కురిపించనున్నాయి. అందుకు కారణం మార్కెట్లో మన ఎర్రబంగారానికి ధరలు ఆశాజనకంగా ఉండటమే. ముఖ్యంగా ఏపీలో జనవరి నుంచి మిర్చి ధరల్లో క్రమ క్రమంగా పెరుగుదల కనిపించింది. క్వింటాలుకు సగటున రూ.20 వేల వరకు ధర లభిస్తోంది. జనవరి నుంచి ఇప్పటి వరకు సగటున క్వింటాలుకు రూ.5 వేలకు పైగానే ధర పెరిగింది. మిర్చికి డిమాండ్ పెరగడంతో వ్యాపారులు నేరుగా గ్రామాలకు చేరుకుని మధ్యవర్తుల జోక్యం లేకుండానే రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేస్తున్నారు. దీంతో గత నాలుగైదేళ్లుగా నష్టాలను చూసిన మిర్చి రైతులకు తాజా ధరలు ఉపశమనం అందించాయి. మార్కెట్లో మంచి ధర పలకడంతో ప్రస్తుతం శీతల గోదాముల్లో నిల్వ చేసిన సరకు కొద్ది కొద్దిగా తగ్గడం మొదలైంది.ఇక గుంటూరు మార్కెట్ యార్డుకు గత వారంలో 1.29 లక్షల బస్తాల మిరప రాగా.. ఇందులో ఏకంగా 1.26 లక్షల బస్తాల వరకు అమ్ముడయ్యాయి. అయితే మిర్చి సాగు ఈసారి ఒక్క ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే కాదు.. కర్ణాటక, తెలంగాణ, గుజరాత్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లో సైతం తగ్గింది.ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరిగినట్లైంది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్?లో డిమాండ్ అధికంగా ఉండటంతో జనవరి నెల నుంచే ధరల్లో మార్పులు చోటు చేసుకున్నాయి. గతేడాది క్వింటాల్ మిర్చీ కేవలం రూ. 10 వేలలోపు మాత్రమే పలికింది. ఈ సారి రూ.20 వేలకు పైగానే ధర పలుకు తోంది. తేజ మిర్చి ధర జనవరి, ఫిబ్రవరిలో రూ.15 వేలు ఉంటే ప్రస్తుతం ఏకంగా రూ.19,500కు చేరుకుంది. తాలు రకం కూడా క్వింటాలు ధర రూ.10 వేలకు పైగానే పలుకుతుంది. ఇలా జనవరి నెల నుంచే అన్ని రకాల మిర్చీకి ధరల్లో ఘననీయమైన పెరుగుదల కనిపించింది.పంటలు 50 శాతం తగ్గడం, గోదాముల్లో మిర్చీ నిల్వలు తక్కువగా ఉండటంతో వ్యాపారులు పోటీపడి మరీ పంటను కొను గోలు చేస్తున్నారు. మార్కెట్?లో ధరలు ఊపందుకోవడంతో రైతులు మిర్చి పంట కోతలు కోసిన వెంటనే త్వరితగతిన ఆరబెట్టి మార్కెట్‌కు తరలిస్తున్నారు. అన్ని ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ.4 లక్షల వరకు పంట ఉత్పత్తి వ్యయం అవుతోంది. ఎకరానికి 25 క్వింటాళ్ల దిగుబడి వస్తే సగటున క్వింటాలుకు రూ.18 వేలు వేసిన పాతిక క్వింటాళ్లకు రూ. 4.50 లక్షల వరకు చేతికొచ్చే అవకాశం ఉంది.

రైతులకు ఆనందం: వరుసగా నష్టాలు రావడంతో ఇక సాగు చేయడం తమ వల్ల కాదంటూ కొందరు మిరప సాగు చేయలేదు. ఇది కాస్త కలిసి వచ్చింది. జనవరి ప్రారంభం వరకు నామమాత్రం ధరలు ఉన్నా.. కొత్త సంవత్సరం నుంచి మిరప ధరలు పైపైకి చేరాయి. ప్రస్తుతం క్వింటాల్ మిరపకు సగటున రూ.20 వేల ధర పలుకుతోంది. జనవరికి నేటికి ధరను పోలిస్తే.. సుమారు 5 వేల రూపాయల వరకు పెరిగింది. ప్రస్తుతం మిరపకు డిమాండ్ బాగా ఉండటంతో.. వ్యాపారులు గ్రామాలకు వెళ్లి నేరుగా రైతుల వద్ద నుంచి మిరప కొనుగోలు చేస్తున్నారు. తాజా పరిణామంతో గత ఐదేళ్లుగా మిరప సాగుతో నష్టాలు చవి చూసిన రైతులు ఈసారి లాభాలను కళ్ల చూస్తు న్నారు.మిర్చికి ప్రస్తుతం ఎంత డిమాండ్ ఉందంటే.. గత మంగళ వారం గుంటూరు మార్కెట్ యార్డుకు 1.29 లక్షల బస్తాల మిర్చి రాగా, 1.26 లక్షల బస్తాలు అమ్ముడుపోయాయి. దీన్ని బట్టి మిర్చికి డిమాండ్ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక గుజరాత్, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో కూడా మిరప సాగు తగ్గిపోయింది. అటు అంతర్జాతీయ మార్కెట్ లో మిర్చికి మంచి డిమాండ్ ఉండటంతో.. ఈ సంవత్సరం జనవరి నుంచి మిర్చి ధర క్రమంగా పెరుగుతూ వస్తోంది. గతేడాది ఇదే సమయానికి రూ.10 వేలకు అమ్ముడుపోయిన మిర్చికి ఇప్పుడు రూ.20 వేలధర పలుకుతోంది.సన్న రకాలకుడిమాండ్ బాగా పెరిగింది. తాలు ధరలు క్వింటాలుకు రూ.10 వేలకు పైనే ఉన్నాయి. ధరలు ఆశాజన కంగా ఉండటంతో రైతులు మిరప కోసిన వెంటనే ఆరబెట్టి అమ్మేస్తున్నా రు. ఇదిలా ఉంటే ఈ సంవత్సరం మిరప సాగుకు పెట్టుబడులు భారీగా పెరిగాయి. అన్ని ఖర్చులూ కలిపి ఎకరాకు రూ.4 లక్షల వరకు ఖర్చు అవుతుందంటున్నారు అన్నదాతలు.ఎకరాకు25 క్వింటాళ్ల దిగుబడి వస్తే.. సగటున క్వింటాలుకు రూ.18 వేల ధర లభిస్తే.. అప్పుడు రూ.4.50 లక్షల వరకు చేతికొస్తోందని తెలిపారు.

## సోషల్ మీడియా రూమర్లు..
# బంకుల వద్ద భారీ క్యూ లైన్లు



చంపాపేట్ : పెట్రోల్, డీజిల్ కొరత పై సోషల్ మీడియా వదంతులు వ్యాప్తి చెందడంతో నగరంలో ప్రజలు అయోమయంలో పడుతున్నారు. ప్రభుత్వం, పోలీసులు ఎలాంటి కొరత లేదని స్పష్టం చేస్తూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నప్పటికీ, పరిస్థితి పూర్తిగా అదుపులోకి రావడం లేదు. ఇదే సమయంలో, ఎల్పీజీ, సీఎన్జీ గ్యాస్ సరఫరా పై అనుమానాలు నెలకొనడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో గ్యాస్ బంకుల వద్ద భారీ రద్దీ కనిపిస్తోంది. ముఖ్యంగా మలక్‌పేట్, సంతోష్‌నగర్, చదర్‌ఘాట్ ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర వాహనాలు, ఆటోలు క్యూ లైన్లలో నిలిచిపోయాయి. ప్రజలు ముందస్తుగా గ్యాస్ నింపించుకోవాలని పెద్దఎత్తున బంకుల వద్దకు తరలివస్తుండడంతో ట్రాఫిక్ సమస్యలు కూడా తలెత్తుతున్నాయి. ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు గంటల తరబడి క్యూలో నిలబడాల్సి వస్తుండటంతో వారి ఆదాయం పై ప్రభావం పడుతోంది. ఇక, ఇటీవల పెరిగిన డిమాండ్ కారణంగా నగరంలో ఇంధన వినియోగం సుమారు 25 శాతం వరకు పెరిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.


అధికారులు వెల్లడించిన వివరాల ప్రకారం..: రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరిపడా నిల్వలు ఉన్నాయని సరఫరా నిరంతరంగా కొనసాగుతోందని, వదంతులను నమ్మి అవసరానికి మించి కొనుగోలు చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. వదంతులు ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తూ కృత్రిమ కొరత పరిస్థితులను తెచ్చిపెడుతున్నాయి. సరైన సమాచారం తెలుసుకుని, అవసరానికి మాత్రమే వినియోగించడం ద్వారా పరిస్థితి నియంత్రణలోకి వస్తుందని అధికారులు సూచిస్తున్నారు.

# ముద్రగడకు నో చెప్పిన జగన్



కాకినాడ, : రాజకీయాల్లో ముద్రగడ పద్మనాభానిది ప్రత్యేక స్థానం. 1978లోనే చంద్రబాబు, రాజశేఖర్ రెడ్డి తో పాటు అసెంబ్లీలో అడుగు పెట్టారు. కానీ రాజకీయంగా స్థిరత్వం ఉండదన్న విమర్శ ఆయనపై ఉంది. కాంగ్రెస్ పార్టీ ద్వారా పొలిటికల్ ఎంట్రీ ఇచ్చి తెలుగుదేశం పార్టీలో చేరారు. అక్కడ టిడిపి నాయకత్వంతో విభేదించి కాంగ్రెస్ లోకి వచ్చారు. కాంగ్రెస్ నుంచి బిజెపి.. అక్కడి నుంచి వైసీపీలో చేరారు. మొన్నటి ఎన్నికలకు ముందు జనసేనలో చేరాలని భావించారు. వీలుకాకపోయేసరికి వైసీపీలో చేరారు. అయితే ఇప్పుడు జగన్మోహన్ రెడ్డి ముందు కొత్త డిమాండ్ పెట్టినట్లు ప్రచారం నడుస్తోంది. కానీ జగన్ మాత్రం ఆలోచనలో పడినట్లు సమాచార ముద్రగడ పద్మనాభం తన కుమారుడితో కలిసి ఎన్నికలకు ముందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ కోసం గట్టిగానే పనిచేశారు. ఏకంగా పిఠాపురంలో పవన్ కళ్యాణ్ ను ఓడిస్తానని శపథం చేశారు. అలా చేయకపోతే తన పేరును పద్మనాభరెడ్డిగా మార్చుకుంటానని సవాల్ చేశారు. కానీ ఫలితం లేకపోయింది. పేరు మార్చుకోవాల్సి వచ్చింది. అయితే ముద్రగడ పద్మనాభం పెద్దరికాన్ని గౌరవించి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పబ్లిక్ అడ్వైజరీ కమిటీలో ఆయనకు స్థానం ఇచ్చారు. అయితే ఈ కమిటీ టిడిపి పోలిట్ బ్యూరో మాదిరిగా కాదు. పెద్దగా అధికారాలు కూడా ఉండవు. అందుకే తనకు పార్టీలో పెద్ద పదవి ఇవ్వాలని ముద్రగడ జగన్మోహన్ రెడ్డిని కోరుతున్నట్లు తెలుస్తోంది. ముద్రగడ పద్మనాభం ఉభయ గోదావరి జిల్లాల బాధ్యత లను తనకు ఇవ్వాలని కోరుతున్నట్లు సమాచారం. అయితే ఇప్పటికే ఆయనతో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు చాలామంది విభేదిస్తు న్నట్లు సమాచారం. ఎప్పుడో పాతకాలపు రాజకీయాలు అనుసరిస్తుం టారు ముద్రగడ పద్మనాభం. అందుకే పెద్దగా ఎవరికీ నచ్చరు. ఏ కాపు రిజర్వేషన్ ఉద్యమంతో ముందుకు వెళ్లారు అదే కాపులు ఇప్పుడు ఆయనను నమ్మేస్థితిలో లేరు. మరోవైపు గోదావరి జిల్లాలో జనసేన ప్రభావం అధికంగా ఉంది. ఇటువంటి సమయంలో ముద్రగడ పద్మనాభం కు ఉపయోగ గోదావరి జిల్లాల బాధ్యతలు ఇస్తే ఇబ్బంది కర పరిస్థితులు వస్తాయని జగన్మోహన్ రెడ్డికి తెలుసు. అందుకే జగన్ ఆ పదవి ఇచ్చేందుకు అంగీకరించరు. మరోవైపు చూస్తే ముద్రగడ తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నారు. వయోభా రంతో ఇబ్బందులు ఉన్నాయి. అయితే జగన్ ఇప్పుడు పదవి ఇవ్వక పోతే ముద్రగడ నిర్ణయం ఎలా ఉంటుంది అనేది చూడాలి.

# మన్సూరాబాద్‌లో 'ఫేక్ గ్యాస్ డీలర్' దందా..?



వనస్థలిపురం : ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా యుద్ధ ప్రభావంతో వంట గ్యాస్? కొరత రోజు రోజుకు పెరుగుతోంది. వినియోగదారులు ఏజెన్సీల వద్ద బారులు తీరాల్సి వస్తోంది. ఈ అత్యవసర పరిస్థితులను కొంత మంది అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఎల్బీనగర్? పరిధిలోని మన్సూరాబాద్ డివిజన్‌లో గ్యాస్ దందా వెలుగులోకి వచ్చింది. సాయి సప్తగిరి 5వ క్రాస్ రోడ్డులో 'తెలంగాణ గ్యాస్' పేరుతో బోర్డు ఏర్పాటు చేసి, ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను నిల్వ చేసి పంపిణీ చేస్తున్న ఘటన స్థానికులను కలవరపెడుతోంది. ప్రతిరోజూ దాదాపు 2 నుంచి 3 ఆటోల ద్వారా వివిధ కంపెనీలకు చెందిన కమర్షియల్ సిలిండర్లను తరలిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఒకవైపు భారీ ఎత్తున సిలిండర్ల స్టాక్ ఉంచి, మరోవైపు సరఫరా కొనసాగించడం వల్ల ఇది పూర్తిగా అనధికార కార్యకలాపమనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా 'తెలంగాణ గ్యాస్' పేరుతో ఉన్న ఈ కేంద్రం ఏ గ్యాస్ కంపెనీకి సంబంధించిన అధికారిక డీలర్ కాదని స్థానికులు చెబుతున్నారు.

విజిలెన్స్ అధికారుల నిర్లక్ష్యం..:ఈ వ్యవహారం పై రంగారెడ్డి జిల్లా సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన సరిగా లేకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా సివిల్ సప్లై ఆఫీసర్‌ను ఫోన్ ద్వారా సంప్రదించగా 'వెంటనే విజిలెన్స్ అధికారులను పంపిస్తాను' అని హామీ ఇచ్చినప్పటికీ, విజిలెన్స్ అధికారిని సంప్రదిస్తే 'ప్రస్తుతం నాకు సమయం లేదు.. తర్వాత వస్తాను' అని చెప్పడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది.

## 21 మీటర్లు దాటితే హై-రైజ్ భవనాలు


హైదరాబాద్, : తెలంగాణ ప్రభుత్వం బిల్డింగ్ రూల్స్‌లో కీలక సవరణలు చేసింది. ఇకపై 21 మీటర్ల పైబడిన వాటినే హై-రైజ్ భవనాలుగా గుర్తిస్తారు. భారీ నిర్మాణాలకు టీడీఆర్ వినియోగాన్ని తప్పనిసరి చేస్తూనే, రోడ్డు వెడల్పును బట్టి అదనపు అంతస్తుల నిర్మాణానికి వెసులుబాటు కల్పించింది. సెట్‌బ్యాక్ నిబంధనలలో 10 శాతం సడలింపునిచ్చింది. పట్టణాల్లో వర్టికల్ గ్రోత్‌ను ప్రోత్సహించాలని నిర్ణయించింది.తెలంగాణలో శరవేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణ, భవన నిర్మాణ రంగాన్ని మరింత క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రియల్ ఎస్టేట్ రంగానికి నూతన జవజీవాలు పోస్తూ.. నిర్మాణ నిబంధనలలో కీలక మార్పులు చేస్తూ మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖ జీవో 95ను విడుదల చేసింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్ రంజన్ పేరుతో వెలువడిన ఈ ఉత్తర్వులు.. ముఖ్యంగా హై-రైజ్ భవనాలు, టీడీఆర్ వినియోగం, అదనపు అంతస్తుల అనుమతులపై స్పష్టమైన మార్గదర్శకాలను వెలువరించాయి.ప్రభుత్వం తాజా సవరణల ప్రకారం.. భవనాల ఎత్తు విషయంలో స్పష్టతనిచ్చింది.

# ఐటీ సిటీకి గండం..




హైదరాబాద్, : సిలికాన్ వ్యాలీ ఆఫ్ ఇండియాగా వెలుగొందుతున్న భాగ్యనగర ఐటీ కోటకు బీటలు వారుతున్నాయా? దశాబ్ద కాలంగా లక్షలాది మందికి ఉపాధి కల్పించి, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచిన ఐటీ రంగం.. ఇప్పుడు మొదటిసారిగా తిరోగమనం వైపు అడుగులు వేస్తోందా? కేవలం గణాంకాల తగ్గుదల మాత్రమే కాదు.. ఏఐ విసిరిన సవాలు.. అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి హైదరాబాద్ ఐటీ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. రాజకీయ విమర్శల వెనుక దాగి ఉన్న అసలు చేదు నిజం ఏమిటి? ఇది కేవలం ఒక తాత్కాలిక మందగమనమా లేక పెను సంక్షోభానికి సంకేతమా? అన్నది చర్చనీయాంశమైంది.హైదరాబాద్ ఐటీ రంగంలో చోటుచేసు కుంటున్న పరిణామాలు ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారా యి. గడిచిన దశాబ్ద కాలంగా అప్రతిహత వృద్ధితో దూసుకుపోయిన ఈ రంగంలో మొదటిసారిగా 'రివర్స్ ట్రెండ్' కనిపిస్తుండటం అటు నిరుద్యోగులను, ఇటు ఆర్థిక నిపుణులను కలవరపెడుతోంది. గణాం కాలు చెబుతున్న చేదు నిజం తెలంగాణ మాజీ ఐటీ మంత్రి కేటీఆర్ చేసిన ఒక ట్వీట్ ఇప్పుడు రాజకీయ సెగలను మించి ఐటీ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. 2023లో 9.46 లక్షలుగా ఉన్న ఐటీ ఉద్యోగుల సంఖ్య, 2026 నాటికి 9.39 లక్షలకు పడిపోయిందని ప్రభుత్వం స్వయంగా గణాంకాల్లో వెల్లడించడం గమనార్హం. అంటే మూడేళ్ల కాలంలో సుమారు 7,000 ఉద్యోగాల తగ్గుదల నమోదైంది. సాధారణంగా ఏటా లక్షల్లో కొత్త ఉద్యోగాలు రావాల్సిన చోట.. ఉన్నవి తగ్గిపోవడం ఐటీ హబ్‌గా హైదరాబాద్ ప్రతిష్టకు సవాలుగా మారింది. ఈ తిరోగమనానికి కేవలం స్థానిక పరిస్థితులే కాకుండా అంతర్జాతీయ పరిణామాలు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తు న్నారు. గతంలో వేలాది మంది అవసరమయ్యే కోడింగ్, టెస్టింగ్ , సపోర్ట్ పనులను ఇప్పుడు ఏఐ సెకన్లలో చేస్తోంది. ఆటోమేషన్ వల్ల కంపెనీలు 'లీన్ మేనేజ్‌మెంట్' తక్కువ మందితో ఎక్కువ పని వైపు మొగ్గు చూపుతున్నాయి. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి: అమెరికా, యూరప్ దేశాల్లో ఆర్థిక మాంద్యం భయాలు, వడ్డీ రేట్ల పెరుగుదల వల్ల ఐటీ ప్రాజెక్టుల బడ్జెట్‌లో కోతలు పడ్డాయి. మన ఐటీ రంగం ప్రధానంగా విదేశీ క్లయింట్లపై ఆధారపడటం వల్ల ఈ ప్రభావం నేరుగా ఇక్కడ కనిపిస్తోంది. పాత పద్ధతుల్లో సాగే సాఫ్ట్‌వేర్ మెయింటెనెన్స్ పనులు తగ్గిపోతున్నాయి. కంపెనీలు కేవలం హై-లెవల్ నైపుణ్యం ఉన్నవారిని మాత్రవే తీసుకుంటున్నాయి, దీనివల్ల కొత్తవారికి అవకాశాలు దెబ్బతింటున్నాయి. ఆర్థిక వ్యవస్థపై పడనున్న 'చైన్ ఎఫెక్ట్' ఐటీ రంగం కేవలం కంప్యూటర్లకే పరిమితం కాదు. ఇది ఒక పెద్ద ఎకోసిస్టమ్. ఐటీ ఉద్యోగుల కొనుగోలు శక్తిపైనే హైదరాబాద్‌లోని రియల్ ఎస్టేట్, హోటల్ రంగం, రవాణా, రిటైల్ వ్యాపారాలు ఆధారపడి ఉన్నాయి. ఉద్యోగాల కోత లేదా వేతనాల స్తబ్దత కొనసాగితే గృహ రుణాలు వినియోగ వస్తువుల విక్రయాలు తగ్గి, నగరం యొక్క మొత్తం ఆర్థిక చక్రం మందగించే ప్రమాదం ఉంది. ముందున్న మార్గం: నైపుణ్యమే ఆయుధం రాజకీయ విమర్శలు ఎలా ఉన్నా ఐటీ రంగం ఇప్పుడు ఒక పరివర్తన దశలో ఉందన్నది కాదనలేని వాస్తవం. భవిష్యత్తులో కేవలం రొటీన్ పనులు చేసేవారికి చోటు ఉండదు. "పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ ఇది ముగింపు కాదు. జెనరేటివ్ ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కొత్త టెక్నాలజీలలో ఉద్యోగులు త్వరగా నైపుణ్యం సాధించాల్సిన అవసరం ఉంది." అని నిపుణులు సూచిస్తు న్నారు. కాకుండా, కొత్త పెట్టుబడులను ఆకర్షించేలా 'స్కిల్లింగ్ సెంటర్స్' పై దృష్టి పెట్టాలి. ఈ హెచ్చరికను గమనించి అప్రమత్తం కాకపోతే హైదరాబాద్ సాధించిన ఐటీ కీర్తి మసకబారే ప్రమాదం ఉంది.

# భారం... భారం..



న్యూఢిల్లీ, : ఇరాన్ – అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేస్తోంది. హార్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం, గల్ఫ్ దేశాల్లోయిని ఆయిల్ రిఫైనరీలు, ఎల్‌పీజీ కంపెనీలపై ఇరాన్ చేస్తున్న దాడులతో క్రూడ్ ఆయిల్ సరఫరా, ఎల్‌పీజీ, ఎల్ఎన్‌జీ సరఫరాకు అంతరాయం కలిగింది. దీంతో క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు 105 డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచంలో అన్ని దేశాలు ఆయిల్ ధరలు పెంచుతున్నాయి. మన దేశంలో గ్యాస్ ధర పెరిగింది. మరోవైపు వంటనూనెతోపాటు చాలా రకాల వస్తువులపై యుద్ధం ప్రభావం పడింది. దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయని, ఇది ప్రజల జీవన ఖర్చులను మరింత భారపడేస్తోందని కాంగ్రెస్ విమర్శించింది.రెండు వారాల్లోనే అనేక కీలక ఉత్పత్తులు, సేవల ధరలు గణనీయంగా పెరిగాయి. ఇది ఆర్థిక విధానాలు, అంతర్జాతీయ మార్కెట్ ప్రభావాల వల్లేనా, లేక ఇతర కారణాలా అనే చర్చకు దారితీసింది.కాంగ్రెస్ పార్టీ తెలిపిన వివరాల ప్రకారం వాణిజ్య సిలిండర్ ధర రూ.100 కుపైగా పెరిగింది. గృహ సిలిండర్ ధర రూ.60 పెరిగింది. వంట నూనెల ధర రూ.10 నుంచి రూ.30 వరకు పెరిగింది. పారిశ్రామిక డీజిల్ లీటర్‌కు రూ.20కిపైగా పెరిగింది. అధిక గ్రేడ్ పెట్రోల్ లీటర్‌కు రూ.2కుపైగా పెరిగింది. ఫుడ్ డెలివరీ సర్వీస్‌లు ఆర్డర్‌కు రూ.2 పెంచాయి. విమాన చార్జీలు రూ.400 నుంచి రూ.2,000 వరకు పెరిగాయి. ప్లాస్టిక్ ప్యాకేజింగ్ సెట్‌కు రూ.30?50 వరకు పెరిగింది. కుకింగ్ అప్లయన్స్‌లు (ఇండక్షన్) ధరలు 35?45% పెరిగాయి. ఇవి రోజువారీ జీవితాన్ని ప్రభావితం చేస్తున్నాయి, **ఎందుకు పెరిగాయంటే..** : అంతర్జాతీయ ఆయిల్ ధరలు, డాలర్ విలువ పెరగడం, రూపాయి విలువ పతనం. ధరలు పెరగడానికి ప్రధాన కారణాలు. ప్రభుత్వం ఎక్సైజ్ డ్యూటీలు, సబ్సిడీలు తగ్గించడం వల్ల కూడా ప్రజలపై భారం పడుతోందని కాంగ్రెస్ ఆరోపణ. మరోవైపు, గ్లోబల్ సప్లై చైన్ సమస్యలు, ఇన్‌ఫ్లేషన్ ఒత్తిడి కూడా పాత్ర వహిస్తున్నాయి.

# జ్ఞాపకంగా కృష్ణా ప్యాలెస్'



విజయవాడ, : కృష్ణా నదిపై బ్రిటిషర్ల హయాంలో నిర్మించిన బ్రిడ్జి చరిత్రలో జ్ఞాపకంగా మిగలబోతోంది. 130 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జి పిల్లర్ల కూల్చివేతలు మొదలు పెట్టారు. కొత్త డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేసేందుకు ఈ పాత బ్రిడ్జి పిల్లర్లను కూల్చివేయబోతున్నారు. హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో కూల్చివేతలు సాధ్యం కాకపోవడంతో.. అధికారులు లిమిటెడ్ బ్లాస్టింగ్ విధానంలో కూల్చేందుకు సిద్ధమవుతున్నారు. 130 ఏళ్లకుపైగా చరిత్ర కలిగిన బ్రిటీష్ కాలం నాటి రైల్వే బ్రిడ్జి కనమరుగు కాబోతోంది. 1893లో ప్రారంభించిన ఈ బ్రిడ్జి స్థానంలో కొత్తగా డబుల్ లైన్ బ్రిడ్జిని నిర్మించడం కోసం రైల్వేశాఖ కసరత్తు చేస్తోంది. గతంలోనే ఈ బ్రిడ్జిపై ఉన్న నిర్మాణాన్ని కూల్చివేయగా.. ప్రస్తుతం ఈ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన పిల్లర్లను తొలగించే పనులు చేపట్టారు. రెండు వారాలకు పైగా హైడ్రాలిక్ క్రేన్ల సహాయంతో పిల్లర్లను పగలగొట్టాలని ప్రయత్నించారు.. కానీ వీలు పడలేదు. అందుకే ఈ పిల్లర్లను కూల్చివేసేందుకు లిమిటెడ్ బ్లాస్టింగ్ పద్ధతిలో కూల్చివేతలు ప్రారంభించనున్నారు. ఈ విధానంలో ఒక్కో పిల్లర్‌ను తొలగించకుంటూ పోతారు. దీనికి చాలా సమయం పడుతుందని చెబుతున్నారు. 1856 ప్రాంతంలో అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఎంఎస్ఎం (మద్రాస్ టు సదరన్ మరాఠా) రైల్వేలో విజయవాడ ఓ భాగంగా ఉండేది. 1893లో కృష్ణానదిపై మూడు కిలోమీటర్ల పొడవున మీటర్ గేజ్ విధానంలో ఈ రైల్వే బ్రిడ్జిని ప్రారంభించారు. వంతెన ప్రవేశ మార్గంలో కోట బురుజులను తలపించే రెండు నిర్మాణాలు ఉండటం, అవి చూసేందుకు ప్యాలెస్‌ను తలపించడంతో.. ఈ బ్రిడ్జికి కృష్ణా ప్యాలెస్‌గా పేరు పెట్టారు. ఈ బ్రిడ్జి నిర్మాణానికి స్టీల్ వాడకుండా రాతి బండలు, గానుగ సున్నం సాయంతోనే అత్యంత పటిష్టంగా నిర్మించారు. అందుకే ఇన్నేళ్లు గడిచినా పిల్లర్లను కూల్చడానికి శ్రమించాల్సి వస్తోంది. 1897లో ఈ రైల్వే బ్రిడ్జిని బ్రాడ్ గేజ్‌గా అప్‌గ్రేడ్ చేశారు. అనంతరం రైల్వేశాఖ ఈ బ్రిడ్జికి తూర్పు, పశ్చిమ వైపున రైల్వే బ్రిడ్జిలు నిర్మాణం చేసింది. 1985 వరకు ఈ వంతెన సేవలు అందించింది. 1993లో అధికారికంగా ఈ వంతెనపై రాకపోకలు నిలిపేశారు. ఆ తర్వాత కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జి వయాడక్ట్‌ను తొలగించగా.. అప్పటి నుంచి ఈ పిల్లర్లు మాత్రమే ఉండిపోయాయి. అయితే ప్రస్తుతం విజయవాడ, గూడూరు మధ్య మూడో రైల్వే లైన్ నిర్మాణం చేపట్టడంతో.. డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి నిర్మించాలని ప్లాన్ చేశారు. అందుకే ప్రస్తుతం చారిత్రక కృష్ణా ప్యాలెస్ బ్రిడ్జికి సంబంధించి మిగిలిన పిల్లర్లను కూడా తొలగించాలని నిర్ణయించారు. 130 ఏళ్లకుపైగా చరిత్ర ఉన్న బ్రిడ్జికి సంబంధించిన పిల్లర్లను తొలగించొద్దని కోరుతూ గతంలో కొందరు రైల్వే అధికారులకు లేఖలు రాశారు. దీంతో ఈ బ్రిడ్జి జోలికి వెళ్లలేదు.. కానీ ఇప్పుడు డబుల్ లైన్ రైల్వే బ్రిడ్జి కోసం కృష్ణా ప్యాలెస్ వంతెన పిల్లర్లను తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఒకవేళ ఈ వంతెన పిల్లర్లను అలాగే వదిలేసి కొంత దూరంలో కొత్త బ్రిడ్జి నిర్మించాలన్నా అనుమతుల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అందుకే ఈ పాత బ్రిడ్జిని తొలగించి.. కొత్త బ్రిడ్జిని నిర్మించాలని ప్లాన్ చేశారు. ముందుగా పిల్లర్లను తొలగించే ప్రక్రియను మొదలు పెట్టారు. కానీ వంతెన పిల్లర్లు ఇప్పటికీ పటిష్టంగా ఉండటంతో.. హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో వాటిని తొలగించడం సాధ్యం కాలేదు. అందుకే లిమిటెడ్ బ్లాస్టింగ్ విధానంలో ఈ పిల్లర్లను కూల్చే పనులు ప్రారంభించనున్నారు. ఈ విధానంలో తక్కువ మోతాదులో పేలుడు పదార్థాలను ఉపయోగించి, పిల్లర్లకు పగుళ్లు వచ్చేలా చేస్తారు. ఆ తర్వాత హైడ్రాలిక్ క్రేన్ల సాయంతో తొలగిస్తారు. దీంతో విజయవాడ చరిత్రలో 'కృష్ణా ప్యాలెస్' వంతెన జ్ఞాపకంగా మిగలబోతోంది

## ఉపాధి హామీ కూలీలపై తేనెటీగల దాడి


### పలువురికి తీవ్ర గాయాలు



మంచిర్యాల: మంచిర్యాల జిల్లాలోని దండేపల్లిలో ఉపాధి హామీ పనుల కోసం వెళ్లిన కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో పలువురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. గురువారం ఉదయం దండేపల్లి మండలకేంద్ర సమీపంలోని దండేపల్లి ఫారెస్ట్ బీట్ పరిధిలో ఉపాధి హామీ పథకం కింద కూలీలు పనులు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సమీపంలోని చెట్టుపై ఉన్న తేనెటీగలు ఒక్కసారిగా కూలీలపై దాడి చేశాయి. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే తేనెటీగలు గుంపులుగా వచ్చి కూలీలను కుట్టడంతో అక్కడ తొక్కిసలాట జరిగింది. ప్రాణాలు కాపాడుకోవడానికి కూలీలు పరుగులు తీసినప్పటికీ, అప్పటికే పలువురికి తీవ్ర గాయాలయ్యా యి. గాయపడిన కూలీలను తోటి సిబ్బంది వెంటనే దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం వారికి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. క్షతగాత్రులలో కొందరి పరిస్థితి నిలకడగానే ఉన్నప్పటికీ, తేనెటీగలు ఎక్కువగా కుట్టిన వారు తీవ్ర అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది.


## సోషల్ మీడియాకు బానిసవుతున్న యువత..

### మెటా, యూట్యూబ్‌కు భారీ జరిమానా



లాస్ ఏంజిల్స్: సోషల్ మీడియాకు యువత బానిసలు అవుతున్నట్లు నమోదు అయిన కేసులో.. మెటా, యూట్యూబ్ సంస్థలకు అమెరికా కోర్టు భారీ జరిమానా వేసింది. చిన్నతనం నుంచి సోషల్ మీడియాకు బానిసైనట్లు ఓ మహిళ దాఖలు చేసిన కేసులో లాస్ ఏంజిల్స్ జ్యూరీ అసాధారణ తీర్పును వెలువరించింది. ఆ అమ్మాయికి రెండు కంపెనీలు కలిసి సుమారు 6 మిలియన్ల డాలర్ల నష్టపరిహారాన్ని చెల్లించాలని జ్యూరీ తన ఆదేశాల్లో పేర్కొన్నది. సోషల్ మీడియా కాంటెంట్ సిగరెట్ల తరహాలో యువతను బానిసలుగా మారుస్తున్నట్లు జ్యూరీ ఆరోపించింది. పిల్లలు, యువకులు సోషల్ మీడియా తప్ప మరో ప్రపంచాన్ని గ్రహించలేకపోతున్నట్లు జ్యూరీ చెప్పింది. సోషల్ మీడియా వల్ల వ్యక్తిగతంగా మనుషులు నష్టపోతున్నారని పేర్కొన్నది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ కంపెనీ యజమానులు.. పిల్లల సంరక్షణ మరిచి తమ సోషల్‌మీడియా వ్యాపారాన్ని నిర్వహిస్తున్నట్లు జ్యూరీ వెల్లడించింది. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ ప్రస్తుతం మెటా పరిధిలో ఉన్నాయి, ఇక యూట్యూబ్ మాత్రం గూగుల్ ఆధీనంలో ఉన్నది. అయితే ఈ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు అన్నీ యువతను ఆకర్షించే రీతిలో తమ ప్రోగ్రామింగ్‌ను తయారు చేసుకున్నట్లు జ్యూరీ పేర్కొన్నది. అడిక్షన్ కేసులో 20 ఏళ్ల అమ్మాయి మానసిక ఆరోగ్యాన్ని సోషల్ మీడియా దెబ్బతీసినట్లు జ్యూరీ వెల్లడించింది. కాలే అనే అమ్మాయికి 6 మిలియన్ల డాలర్లు చెల్లించాలని జ్యూరీ సభ్యులు ఆదేశించారు. అయితే ఇలాంటి మీడియా అడిక్షన్ కేసులు ప్రస్తుతం అమెరికా కోర్టుల్లో కొన్నివందల సంఖ్యల్లో ఉన్నాయి. తాజా తీర్పుతో ఆ కేసులకు ఊతం ఇచ్చినట్లు అవుతుందని నిపుణులు అంటున్నారు. జ్యూరీ ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తున్నట్లు మెటా, గూగల్ సంస్థలు పేర్కొన్నాయి. టీనేజీ యువత మానసిక ఆరోగ్యం చాలా సంక్లిష్టంగా ఉంటుందని, ఒకే ఒక్క యాప్‌తో అవన్నీ లింకు పెట్టడం సరికాదు అని ఆ సంస్థలు వాదించాయి. గూగుల్ ప్రతినిధి మాట్లాడుతూ యూట్యూబ్ గురించి తప్పుగా అర్థం చేసుకున్నారని, యూట్యూబ్ అనేది స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ అని, అదేమీ సోషల్ మీడియా సైట్ కాదు అని పేర్కొన్నారు. కాలే అమ్మాయి కేసులో మెటా సంస్థ 70 శాతం, గూగల్ సంస్థ 30 శాతం జరిమానా చెల్లించాల్సి ఉంటుంది.

## అందుబాటులోకి రానున్న నేషనల్ హైవే 565




ఒంగోలు: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మధ్య కీలకమైన నేషనల్ హైవే 565 పనులు పూర్తి చేశారు. ఈ హైవేపై వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. అయితే ఈ హైవే పనుల్లో భాగంగా.. యర్రగొండ పాలెం దగ్గర 20 కిలో మీటర్ల రోడ్డును విస్తరించారు. దీంతో హైదరాబాద్ వెళ్లే ప్రయాణికులకు ఊరట దక్కింది. ఈ 20 కిలో మీటర్లు అటవీ ప్రాంతం మీదుగా వెళుతోంది.. బ్రిడ్జిలు, అండర్‌పాస్‌లతో ప్రయాణం సాఫీగా సాగుతోంది. తెలుగు రాష్ట్రాల మధ్య నేషనల్ హైవే 565 అందుబాటులోకి వచ్చింది. తెలంగాణలోని నకిరేకల్ వద్ద మొదలయ్యే ఈ హైవే.. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి సమీపంలో ఉన్నఏర్పేడు దగ్గర ముగుస్తుంది. ఈ కొత్త హైవే హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి 65ని.. మదనపల్లె నుంచి నాయుడుపేట వెళ్లే నేషనల్ హైవే 71తో కలుపుతుంది. తెలంగాణలోని నల్గొండ, ఖమ్మం, వరంగల్ తదితర ప్రాంతాల నుంచి తిరుపతి వెళ్లడానికి ఈ కొత్త హైవే ప్రత్యామ్నాయ మార్గంగా ఉపయోగపడనుంది. ఈ హైవే నల్గొండ, మాచర్ల, యర్రగొండపాలెం, మార్కాపురం, పొదిలి, కనిగిరి, పామూరు, దుత్తలూరు, రాపూరు, వెంకటగిరి, ఏర్పేడు మీదుగా వెళుతోంది. కొత్తగా ఏర్పడిన మార్కాపురం జిల్లా యర్రగొండపాలెం నుంచి హైదరాబాద్ రాత్రిళ్లు అటవీ ప్రాంతం మీదుగా వెళ్లడం గతంలో చాలా ఇబ్బందిగా ఉండేది. ముఖ్యంగా పుల్లల చెరువు దగ్గర నుంచి వెల్దుర్తి మండలం వరకు రోడ్డు పరిస్థితి దారుణంగా ఉండేది. ట్రాఫిక్ సమస్యలు ఎదురయ్యేవి. అయితే జాతీయ రహదారి 565 నిర్మాణంతో ఆ కష్టాలు తొలగిపోయాయి. ఈ రోడ్డు అభివృద్ధి చేయడంతో యర్రగొండపాలెం నుంచి హైదరాబాద్‌కు ప్రయాణం సులభతరమైంది. ఈ రూట్‌లో.. ఎన్‌హెచ్-565లో భాగంగా ఉన్న ఈ 20 కిలోమీటర్ల రోడ్డు విస్తరణకు గతంలో ఇబ్బందులు ఎదురయ్యాయి. ముఖ్యంగా అటవీ అనుమతులు ఆలస్యం కావడంతోపాటు మరికొన్ని అడ్డంకులు వచ్చాయి. అయితే 2024లో ఈ పనులకు లైన్ క్లియర్ కావడంతో.. గతేడాది పనులు ప్రారంభించి వేగవంతం చేశారు. ఈ రోడ్డును నిర్దేశిత సమయం కంటే ముందే పూర్తిచేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. అటవీ ప్రాంతం మీదుగా కొండలు, లోయల మధ్య వెళ్లే ప్రయాణికులకు ఈ మార్గం సరికొత్త అనుభూతిని పంచుతోంది. రోడ్డు బాగోలేకపోవడంతో పుల్లలచెరువు నుంచి వెల్దుర్తి మండలం వరకు ప్రయాణానికి 50 నిమిషాలు పట్టేది. కానీ ఇప్పుడు 20 నిమిషాల్లోనే వెళ్లొచ్చు. 20 కిలోమీటర్ల పొడవైన ఈ రోడ్డు నిర్మాణానికి రూ.393 కోట్లు ఖర్చు చేశారు. అటవీ ప్రాంతం, ఘాట్ రోడ్డు కావంతో చిన్న, పెద్దవి కలిపి మొత్తం 16 వంతెనలు, 8 అండర్‌పాస్‌లను ఏర్పాటు చేశారు. మార్కాపురం జిల్లాతో కడప జిల్లాలోని పోరుమామిళ్ల ప్రాంతం నుంచి ఈ రోడ్డు మీదుగానే హైదరాబాద్ వెళ్లొచ్చు. ఈ హైవే మొత్తం పొడవు దాదాపు 420 కిలోమీటర్లు కాగా.. మెజార్టీ భాగం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉంది. తెలంగాణలోని నకిరేకల్, నల్గొండ, కనగల్, దేవరకొండ ప్రాంతాలను దాటిన తర్వాత మాచర్ల వద్ద ఈ హైవే ఏపీలోకి ఎంటర్ అవుతుంది. ఏర్పేడు వద్ద ఎడమ వైపు ప్రయాణిస్తే శ్రీకాళహస్తి, కుడి వైపు తిరిగే తిరుపతి వెళ్లొచ్చు.

## కవచ్ టెక్నాలజీతో ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ

చెన్నై: భారతదేశ గర్వకారణమైన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రధానంగా చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ లో రూపుదిద్దుకుంటున్నాయి. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా స్వదేశీ పరిజ్ఞానంతో తయారవుతున్న ఈ సెమీ హైస్పీడ్ రైళ్లు, అత్యాధునిక సాంకేతికతకు నిలువుటద్దం. కేవలం చెన్నైలోనే కాకుండా, పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని రాయ్‌బరేలీలోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీ, లాతూర్, సోనిపట్‌లలో కూడా వీటి తయారీకి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. కేవలం 52సెకన్లలోనే 100కిలోమీటర్ల వేగాన్నిఅందుకోగల సామర్థ్యం ఈ రైళ్ల సొంతం. ప్రయాణికుల భద్రత కోసం 'కవచ్' టెక్నాలజీ, సౌకర్యం కోసం 180డిగ్రీలు తిరిగే సీట్లువీటి ప్రత్యేకత. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ఈ వందే భారత్ రైళ్లు భారతీయ రైల్వే విప్లవం అని చెప్పక తప్పదు. తమిళనాడులోని చెన్నైలో ఉన్న ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ వందే భారత్ రైళ్లకు జన్మస్థానం. 2018లో మొట్టమొదటి ట్రైన్ 18 (వందే భారత్) ఇక్కడే తయారైంది. అత్యుత్తమ ఇంజనీర్లు, ఆధునిక యంత్రాల సాయంతో ప్రతి కోచ్‌ను ఇక్కడ అత్యంత జాగ్రత్తగా తీర్చిదిద్దుతారు. ప్రస్తుతం వందే భారత్ రైళ్లకు దేశవ్యాప్తంగా భారీ డిమాండ్ ఉంది. దీన్ని చేరుకోవడానికి రైల్వే శాఖ తయారీని ఇతర కేంద్రాలకు కూడా విస్తరించింది. ఉత్తరప్రదేశ్‌లోని మోడ్రన్ కోచ్ ఫ్యాక్టరీలో కొత్త కోచ్‌ల తయారీ జరుగుతోంది. లాతూర్ ఒ సోనిపట్: మహారాష్ట్రలోనిలాతూర్ మరియు హర్యానాలోని సోనిపట్ రైల్వే యూనిట్లలో కూడా తయారీ పనులు వేగవంతం చేశారు. వందే భారత్ కేవలం ఒక రైలు మాత్రమే కాదు, అదొక సాంకేతిక అద్భుతం. ఇది గరిష్టంగా గంటకు 160-180 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. రైళ్ల మధ్య ఢీకొనే ప్రమాదాన్ని నివారించే కవచ్ వ్యవస్థ ఇందులో ఉంది. మరింత ప్రత్యేకంగా సెల్ఫ్-ప్రొపెల్డ్ ఇంజిన్ (ఇంజిన్ విడిగా ఉండదు), ఆటోమేటిక్ తలుపులు, వై-ఫై, మరియు జీపీఎస్ ఆధారిత సమాచార వ్యవస్థ ప్రయాణికులకు లభిస్తాయి. మేక్ ఇన్ ఇండియా విజన్ కింద తయారవుతున్న ఈ రైళ్లు ప్రపంచ స్థాయి ప్రమాణాలను కలిగి ఉన్నాయి. భవిష్యత్తులో వందే భారత్ స్లీపర్ వెర్షన్లు, మెట్రో వెర్షన్లు కూడా అందుబాటులోకి రానున్నాయి. తక్కువ ఖర్చుతో ఎక్కువ వేగవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా భారతీయ రైల్వే అడుగులు వేస్తోంది.

## నిలిచిన బాస్మతీ రైస్ ఎక్స్‌పోర్ట్స్..

### ఓడరేవుల్లోనే 10 లక్షల టన్నుల బియ్యం






పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధపు సెగలు వేల కిలోమీటర్ల దూరంలో ఉన్న భారతీయ వ్యవసాయ రంగాన్ని, ముఖ్యంగా బాస్మతీ బియ్యం ఎగుమతి పరిశ్రమను కోలుకోలేని దెబ్బ తీశాయి. ఏటా సుమారు 6 బిలియన్ డాలర్లు అంటే రూ.54వేల కోట్ల విదేశీ మారక ద్రవ్యాన్ని దేశానికి తెచ్చి పెట్టే ఈ రంగం.. ప్రస్తుతం రవాణా మార్గాల నిలిపివేత, పేమెంట్ సమస్యలు.. షిప్‌మెంట్‌ల జాప్యంతో తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. భారత్ ఏటా సుమారు 60 లక్షల మెట్రిక్ టన్నుల బాస్మతీ బియ్యాన్ని ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేస్తోంది. ఇందులో దాదాపు సగానికి పైగా వాటా సౌదీ అరేబియా, ఇరాన్, ఇరాక్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాలదే. సాధారణంగా రంజాన్, ఈద్ పండుగల సమయంలో ఈ దేశాలకు ఎగుమతులు భారీ స్థాయిలో ఉంటాయి. అయితే ప్రస్తుత యుద్ధ వాతావరణం వల్ల మధ్యప్రదేశ్ వంటి ప్రధాన బాస్మతీ హబ్‌లలోని రైస్ మిల్లులు వెలవెలబోతున్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే ఎగుమతి సీజన్‌లో ఇప్పుడు నిశ్శబ్దం ఆవరించిందని వారు చెబుతున్నారు. యుద్ధం కారణంగా సముద్ర మార్గాల్లో ముప్పు పెరగడంతో లాజిస్టిక్స్ రంగం కుదేలైంది. గతంలో ఒక కంటైనర్‌కు 2వేల 500 డాలర్లుగా ఉన్న రవాణా ఖర్చు ఇప్పుడు ఏకంగా 7వేల నుండి 9వేల డాలర్లకు చేరింది. దీనికి తోడు ఇన్సూరెన్స్ ప్రీమియాలు పెరగడం, కంటైనర్ల కొరత ఏర్పడటంతో ఎగుమతిదారులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 10 లక్షల టన్నుల బాస్మతీ బియ్యం ఓడరేవుల్లో, గోడౌన్లలో మూలుగుతోంది. ప్రీమియం రకమైన '1121' బాస్మతీకి పశ్చిమాసియాలో ఉన్న డిమాండ్ యూరప్ లేదా ఆఫ్రికా దేశాల్లో ఉండదు. కాబట్టి ఈ నిల్వలను ఇతర మార్కెట్లకు మళ్లించడం కూడా సాధ్యం కావడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఈ అంతరాయం వల్ల ఎగుమతిదారుల వర్కింగ్ క్యాపిటల్ పూర్తిగా నిలిచిపోయింది. మార్కెట్ వర్గాల అంచనా ప్రకారం సుమారు 2వేల కోట్ల నుండి 25వేల కోట్ల రూపాయల వరకు చెల్లింపులు నిలిచిపోయాయి. ఇది కేవలం వ్యాపారులకే కాకుండా పరోక్షంగా రైతులపై కూడా ప్రభావం చూపుతోంది. మిల్లులు కొనుగోళ్లు నిలిపివేయడంతో ధాన్యం ధరలు తగ్గే అవకాశం పెరిగింది. ఇది రైతుల ఆదాయాన్ని దెబ్బతీస్తుంది. రాబోయే సాగు సీజన్‌పై కూడా ఈ ప్రభావం పడే ప్రమాదం ఉందని తెలుస్తోంది. భారత ప్రభుత్వం ఈ దిశగా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నప్పటికీ, పశ్చిమాసియాలో శాంతి నెలకొంటే తప్ప భారత బాస్మతీ ఎగుమతుల ఇంజిన్ మళ్లీ గాడిన పడటం కష్టంగా కనిపిస్తోంది.

## డబ్బు కడుతున్నా డేటా మాయం

రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా ప్రస్తావించే ప్రతి అంశం సగటు భారతీయుడు ఆలోచనలకూ చాలా దెగ్గరగా ఉంటుంది. ఇప్పటి అనేక అంశాలపై రాజ్యసభలో ప్రభుత్వాన్ని నిలదీశారు. ఇక తాజగా ఆయన రోజువారీ డేటా లిమిట్స్‌తో వచ్చే మొబైల్ రీచార్జ్ ప్లాన్లపై చర్చించారు. తాజాగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం చాలా టెలికాం సంస్థలు భారీగా డేటా ఇస్తున్నాయి వంటి రోజువారీ డేటా పరిమితులను అందిస్తున్నాయి. అయితే వినియోగదారులు పూర్తిగా డేటా ఉపయోగించకపోతే, మిగిలిన డేటా అర్ధరాత్రి తర్వాత పూర్తిగా రద్దవుతోంది. ఉదాహరణకు, 2ఉః ప్లాన్ తీసుకున్న వినియోగదారు 1.5ఉః మాత్రమే వాడితే, మిగిలిన 0.5ఉః డేటా పూర్తిగా పోతుంది. దీనికిరిఫండ్ లేదారోల్‌ఓవర్ వంటి అవకాశంలేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నేటి ఆధునిక యుగంలో మనిషికి గాలి, నీరు ఎంత అవసరమో, ఇంటర్నెట్ కూడా అంతే అవసరం. అయితే వినియోగదారులు డబ్బులు చెల్లించికొనుగోలు చేసినమొబైల్ డేటా, నిర్ణీత గడువు లోగా వాడకపోతే వృథాగా పోతుంది. దీనిపై రాజ్యసభలో చర్చ జరిగింది. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీ రాఘవ్ చద్దా ఈ అంశాన్ని పార్లమెం ట్‌లో లేవనెత్తుతూ టెలికాం కంపెనీల ప్రస్తుత విధానాల్లో మార్పులు రావాలని డిమాండ్ చేశారు. వినియోగదారుల ప్రయోజనాలను కాపా డటమే లక్ష్యంగా ఆయన పలు కీలక సంస్కరణలను ప్రతిపాదించారు. ప్రస్తుతం టెలికాం రంగంలో ఉన్న అతి పెద్ద లోపాన్ని రాఘవ్ చద్దా సభ దృష్టికి తీసుకొచ్చారు. వినియోగదారులు ప్రతిరోజూ నిర్దిష్ట డేటా పరిమితి కోసం ముందుగానే డబ్బులు చెల్లిస్తున్నారు. ఉదాహరణకు ఒక వినియోగదారు రోజుకు 2జీబీ డేటా ప్లాన్ తీసుకుంటే,, అందులో కేవలం 1.5 జీడీ మాత్రమే వాడితే, మిగిలిన 0.5జీ డేటా అర్ధరాత్రి దాటగానే ఎక్స్‌పైర్ అయిపోతుంది. వినియోగదారుడు ఇప్పటికే ఆ జేటా కోసం డబ్బు చెల్లించాడు. అలాంటప్పుడు అది వృథా కావడం లేదా వెనక్కి తీసుకోవడం బాగా లేదు అని చద్దా స్పష్టం చేశారు. ఇది ఏదో అనుకోకుండా జరుగుతున్న పొరపాటు కాదని, టెలికాం కంపెనీలు కావాలనే అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానమని ఆయన మండిపడ్డారు. దీని వల్ల వినియోగదారులు తాము పూర్తిగా వాడుకోలే ని సామర్థ్యం కోసం పదే పదే డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. టెలికాం వినియోగదారుల హక్కుల ను కాపా డేందుకు రాఘవ చద్దా ప్రధానంగా మూడు ప్రతిపాదనలు తీసుకొచ్చారు. ప్రస్తుతపద్ధతిలో మిగిలిపోయిన డేటామరుసటి రోజుకు కలవదు. అలా కాకుండా ఒకరోజు మిగిలిపోయనడేటాను మరుసటి రోజు కోటాకు జోడించలా అన్ని టెలికాం సంస్థలు చర్యలు తీసుకోవా లని ఆయనకోరారు. దీనివల్ల వినియోగదారులు తాము కొనుగోలు చేసిన ప్రతి డేటాను సద్వినియోగం చేసుకోనే వీలు ఉంటుంది. కొంతమంది వినియోగదారులు నిరంతరం తమ డేటా పూర్తిగా వాడలేపోతుంటారు. అటువంటి వారి విషంలో, నెల చివరన మిగిలిపోయిన డేటాను లెక్కించి, దాని విలువను బట్టి తదుపరి నెల రీఛార్జ్ మొత్తం తగ్గింపు ఇవ్వాలని చద్దా ప్రతిపాదించారు. ఇది వినియోగదారుల ఆర్థిక భారాన్ని తగ్గిస్తుందని అన్నారు. డేటాబదిలీ అవకాశం డేటాను వినియోగదారుడి డిజిటల్ ఆస్తిగా భావించాలని రాఘవ్‌చద్దా ఒక వినూత్న ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. మనం బ్యాంకు నుంచి డబ్బులను ఇతరులకు పంపినట్టుగానే మన దగ్గర మిగిలిపోయిన డేటాను స్నేహితులకు, లేదా బంధువులకు బదిలీ చేసుకునే వెసులుబాటు ఉండాలని కోరారు. భారత్ డిజిటల్ ఇండియా దిశగా వేగంగా అడుగు లు వేస్తున్న టైంలో డిజిటల్ సేవలు అందరికీ అందుబాటులో ఉండాలని అదే సమయంలో అవి పారదర్శకంగా ఉండాలని చద్దా పేర్కొన్నారు. అది వాడినా వాడకపోయినా మీకే చెందాలి. డేటా విషయంలో కూడా ఇదే సూత్రం వర్తించాలి అన్నారు. కేవలం డేటా మాయమైపోవడం వల్ల టెలికాం కంపెనీలు కోట్లాది రూపాయల లాభాలను గడిస్తున్నాయని, ఇది వినియోగదారులను వంచించడమే నని అన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకొని, వినియోగదారులకు అనుకూలమైన టెలికాం విధానాలను రూపొందిం చాల్సిన అవసరం ఎంతైనా ఉందని సభలో పేర్కొన్నారు. వాడని డేటాకు సర్దుబాటు:వినియోగదా రులు నిరంతరం తక్కువ డేటా వాడితే, మిగిలిన డేటా విలువను తదుపరి రీచార్జ్‌లో తగ్గింపు రూపంలో ఇవ్వాలని సూచిం చారు. వాడని డేటాను కుటుంబ సభ్యులు లేదా స్నేహితుల కు పంపుకునే విధానం ఉండాలని పేర్కొన్నారు. డేటాను వినియోగదారుల "డిజిటల్ ఆస్తి"గా పరిగణించాలి అన్నారు

# ఉద్దానం బాధితులకు ఊరట



శ్రీకాకుళం, : శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంత ప్రజల దశాబ్దాల కల నెరవేరబోతోంది. కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు అండగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పలాసలో చారిత్రాత్మక అడుగు వేసింది. పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌లో రాష్ట్రంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా, తొలి కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ ఆపరేషన్‌ని నిర్వహించనున్నారు. దేశంలోని ప్రముఖ కిడ్నీ మార్పిడి నిపుణులు ప్రత్యేకంగా పలాసకు

## అందుబాటులోకి పలాస కిడ్నీ సెంటర్

విచ్చేసి స్థానిక వైద్యులతో కలిసి ఈ క్లిష్టమైన ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయనున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందించడమే ప్రధాన లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కృషి చేస్తోంది. పలాస సెంటర్ అభివృద్ధికి రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసి, ఆపరేషన్ థియేటర్ల ఆధునికీకరణ, డయాలసిస్ యూనిట్లు, పోస్ట్ – ఆపరేటివ్ కేర్ సెంటర్లను బలోపేతం చేసింది. పేద రోగులకు ఎక్కువ ఖర్చుతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో పొందే కిడ్నీ మార్పిడి చికిత్సను పలాస కేంద్రంలోనే ప్రభుత్వం బాధ్యతగా నిర్వహిస్తోంది. గతంలో కిడ్నీ సమస్యల చికిత్స కోసం ఉద్దానం వాసులు విశాఖపట్నం, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లేవారు. ఇప్పుడు పలాసలోనే ఈ సదుపాయం రావడం వల్ల ప్రయాణ భారం తగ్గుతోండటంతో పాటు అత్యవసర సందర్భాల్లో ప్రాణాలు కాపాడే అవకాశాలు మెరుగుపడతాయి. కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ద్వారా నిరంతరం స్క్రీనింగ్ పరీక్షలు, మందుల పంపిణీ జరుగుతుంది. పేద రోగులకు ప్రైవేట్ ఆస్పత్రులలో లక్షల రూపాయలు ఖర్చయ్యే చికిత్స ఇక్కడ ఉచితంగా లేదా రాయితీపై అందుబాటులో ప్రభుత్వం తీసుకువచ్చింది.

# అనిత ఎందుకో లాస్ట్..!



విశాఖపట్టణం: ఏపీలోటీడీపీ కూటమి ప్రభుత్వం దూకుడు మీద ఉంది. ఒక ప్రణాళిక ప్రకారం ప్రభుత్వ పాలన కొనసాగుతోంది. ప్రతి 15 రోజులకు మంత్రి మండలి సమావేశం. ప్రతి నెల రోజులకు ఒకసారి కలెక్టర్ల రివ్యూ కొనసాగుతూ వస్తోంది. అదే సమయంలో మంత్రులకు ర్యాంకింగ్, వారి పనితీరు మదింపు వంటి విషయంలో సీఎం చంద్రబాబు ముందు ఉంటున్నారు. వారికి ర్యాంకింగ్స్ ఇస్తున్నారు. తాజాగా కలెక్టర్ల రివ్యూలు మంత్రులకు ర్యాంకింగ్స్ ఇచ్చారు చంద్రబాబు. ఈ ర్యాంకింగ్స్ లో మంత్రి కింజరాపు అచ్చెనాయుడు తొలి స్థానంలో నిలిచారు. మంత్రి వంగలపూడి అనిత చివరి స్థానంలో ఉన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగో స్థానంలో నిలిచారు. మంత్రుల శాఖలకు సంబంధించి ఫైళ్ళ క్లియరెన్స్ విషయంలో ఈ ర్యాంకింగ్స్ ఇచ్చారు సీఎం చంద్రబాబు. మంత్రుల శాఖల ప్రగతిలో ఈ ఫైల్ క్లియరెన్స్ కీలక పాత్ర పోషిస్తుంది. అందుకే సీఎం చంద్రబాబు దీనిపైనే స్పెషల్ ఫోకస్ పెడుతున్నారు. మంత్రుల పనితీరుపై మదింపు.. అమరావతిలో కలెక్టర్ల సమావేశం తొలి రోజున మంత్రుల పనితీరుపై హాట్ కామెంట్స్ చేశారు సీఎం చంద్రబాబు. ఆయా శాఖల్లో ఫైళ్ళ క్లియరెన్స్ ఎంత వేగంగా జరుగుతుందని అంశంపై మిత్రులందరికీ రేటింగ్స్ ప్రకటించారు. తొలి స్థానంలో కింజరాపు అచ్చెనాయుడు నిలిచారు. ఆ తరువాత స్థానాల్లో వరుసగా నిమ్మల రామానాయుడు, కొండపల్లి శ్రీనివాస్ ఉన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాలుగు స్థానంలో నిలిచారు. మంత్రి వంగలపూడి అనిత చివరి స్థానంలో నిలిచారు. మంత్రులు తమ ఫైళ్లను క్లియర్ చేసేందుకు ఎంత సమయం తీసుకుంటున్నారో చంద్రబాబు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పనులు, తీసుకున్న నిర్ణయాలు వేగంగా పూర్తి అయ్యేలా త్వరగా ఫైళ్లను క్లియర్ చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు సీఎం చంద్రబాబు. పాలనలో వేగం పెంచడం ద్వారా.. రాష్ట్ర ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఆయన వెల్లడించారు. ప్రతి నెల రోజులకు ఒకసారి కలెక్టర్ల సమావేశం జరపడం ఆనవాయితీగా పెట్టుకున్నారు సీఎం చంద్రబాబుఅందులో భాగంగా నిన్ననే అమరావతిలో కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. ఈరోజు కూడా అది కొనసాగనుంది. కీలక అంశాలపై చర్చలు జరపనున్నారు. ముఖ్యంగా వైద్య ఆరోగ్యశాఖ పై ప్రత్యేక ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. శాఖల ఆదాయంపై కూడా సమీక్షిస్తారు. రాష్ట్ర విద్యారంగం తో పాటు ఉపాధి అవకాశాలపై కూడా చర్చించనున్నారు ఈరోజు సమావేశంలో. కోర్టులో ఉన్న కేసులు, న్యాయశాఖ పరిధిలో ఉన్న అంశాల పైన అధికారులు సీఎంకు వివరాలు అందించనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు సంబంధించి కీలక నిర్ణయం కూడా ఈరోజు తీసుకోనున్నారు. తొలిరోజు మంత్రులకు ర్యాంకింగ్స్ ఇవ్వగా.. ఈరోజు అధికారులకు ర్యాంకింగ్స్ ఇవ్వనున్నారు సీఎం చంద్రబాబు.

# అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి

# ప్రకటించిన ఇరాన్..తిప్పి కొట్టిన అమెరికా

టెహ్రాన్: అమెరికా విమాన వాహకనౌక అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించింది. తమ బాలిస్టిక్ క్షిపణులు ఈ యుద్ధ విమానాన్ని ఢీకొట్టాయని వెల్లడించింది. దాంతో అది పనిచేయడం లేదని, గల్ఫ్ జలాల నుంచి వెనక్కి తగ్గిందని పేర్కొంది. అయితే అమెరికా ఈ ప్రకటనను తోసిపుచ్చింది. ఇరాన్‌పై అమెరికా చేస్తోన్న 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'కి ఈ నౌక మద్దతు ఇస్తూనే ఉందంటూ ఇరాన్ ప్రకటనలను ఖండించింది. ఈమేరకు అమెరికా సెంట్రల్ కమాండ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టింది.

అమెరికా మీడియా కథనాల ప్రకారం.. అబ్రహం లింకన్‌కు అతిదగ్గరగా ఓ ఇరాన్ పడవ వచ్చింది. దానిని గుర్తించిన అమెరికా దళాలు కాల్పులు జరిపాయి. అయితే ఈ ఘటనలో యూఎస్ నౌక దెబ్బతిన్నదా, లేదా అని మాత్రం పేర్కొనలేదు. ఇక, ఇరాన్‌తో యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ట్రంప్ సేనలు దీనిని దక్షిణ చైనా సముద్రం నుంచి పశ్చిమాసియాకు తరలించాయి. ఇందులో ఎనిమిది స్క్వాడ్రన్ల యుద్ధ విమానాలు ఉంటాయి. అబ్రహం లింకన్‌పై దాడి చేశామని ఇరాన్ ప్రకటించడం ఇదే తొలిసారి కాదు. యుద్ధం ప్రారంభమైన మూడు రోజుల తర్వాత నాలుగు క్షిపణులతో దాడి చేశామని చేసిన ప్రకటన కలకలం సృష్టించింది. అయితే ఆ ప్రకటనలో నిజం లేదని అప్పుడు కూడా అమెరికా తోసిపుచ్చింది. ఇరాన్ వద్ద భారీస్థాయిలో హైపర్‌సోనిక్, నౌకా విధ్వంసక క్షిపణులు ఉన్నప్పటికీ అవి అమెరికన్ విమాన వాహక నౌకను తాకడం దాదాపుగా అసాధ్యమనే చెబుతుంటారు. విమాన వాహక నౌక ప్రధాన బలం దాని మీద ఉండే యుద్ధ విమానాలే. యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌పై ఎఫ్/ఏ-18 సూపర్ హార్నెట్, ఎఫ్-35సి స్టెల్త్ యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు, డ్రోన్లు సహా అనేక విమానాలు ఉన్నాయి. ఇవి శత్రువుపై దాడి చేయడంతోపాటు విమాన వాహకనౌకను రక్షించే సామర్థ్యాన్ని కలిగిఉన్నాయి. పోరు సమయంలో విమాన వాహక నౌక సాగరంలో స్థిరంగా ఉండదు. గంటకు 60 కిలోమీటర్ల వేగంతో కదులుతుంటుంది. రియల్‌టైమ్ ఉపగ్రహ నెట్‌వర్క్ లేకుండా దీని జాడను ఎప్పటికప్పుడు పసిగట్టడం కష్టం. యూఎస్ఎస్ అబ్రహం లింకన్ ప్రస్తుతం అరేబియా సముద్రంలో.. ఇరాన్ తీరానికి దూరంలో వ్యూహాత్మక ప్రదేశంలో సంచరిస్తున్నట్లు తెలుస్తోంది.

ఇరాన్ సమీపంలో మోహరించిన అమెరికా విమాన వాహక నౌక యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ లో మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. 'జెరాల్డ్‌లోని లాండ్రీ ప్రదేశాల్లో ఈ మంటలు చెలరేగాయి. అయితే అందుకు యుద్ధం కారణం కాదు. ఆ మంటలను ఆర్పేశాం. నౌకలోని ప్రొపల్షన్ ప్లాంట్‌కు ఎలాంటి డ్యామేజ్ జరగలేదు. గాయపడిన ఇద్దరు నావికులకు చికిత్స అందుతోంది. వారి ఆరోగ్యం నిలకడగా ఉంది. ఈ నౌక ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీలో భాగంగా ఎర్రసముద్రంలో తన సహకారాన్ని కొనసాగిస్తోందని సెంట్రల్ కమాండ్ వెల్లడించింది.

# ఈ సారి వారసులకు షాక్ తప్పదా?

తిరుపతి: 2024లో ఘోర పరాజయం. ఆల్‌మోస్ట్ వైసీపీ శూన్యం నుంచి తిరిగి బౌన్స్ బ్యాక్ కావాల్సి ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రయోగాలు చేసే పరిస్థితి లేదంటున్నారట వైసీపీ అధినేత జగన్. నియోజకవర్గాలపై పట్టున్న నేతలు..రాజకీయంగా అనుభవం ఉన్న లీడర్లు, కుల బలం ఉన్న నేతలకే మళ్లీ టికెట్ ఇచ్చే యోచనలో ఉన్నారట. కానీ చాలామంది నేతలు..వయోభారమనో..తాము యాక్టీవ్‌గా ఉన్నప్పుడే వారసులను రాజకీయాల్లోకి తేవాలని ఆశపడుతున్నారట. అందుకే తమ కొడుకు, కూతురుకు టికెట్ కావాలని ఇప్పటినుంచే అర్జీలు పెట్టుకున్నారట. ఇలా వైసీపీలో చాలామంది లీడర్ల వారసులు రాబోయే ఎన్నికల్లో పోటీకి సిద్ధపడుతున్నారట. 2024లోనే టికెట్ ఆశించిగా కొందరికి తప్ప..మిగతా చోట్ల తండ్రులనే రంగంలోకి దించారు. కొన్ని చోట్ల అధినాయకత్వాన్ని మెప్పించి ఒప్పించి కొందరు లీడర్లు తమ వారసులకు టికెట్లు ఇప్పించుకున్నా పరాభావం తప్పలేదు. దాంతో వైసీపీ హైకమాండ్ ఆలోచనలు మారాయని అంటున్నారు. ఈసారి ఎన్నికలు 2024 కంటే ఎంతో ప్రతిష్టాత్మకమైనవి అని వైసీపీ పెద్దలు భావిస్తున్నారట. దాంతో వారసులకు నో చాన్స్ అన్న చర్చ అయితే ఫ్యాన్ పార్టీలో జోరుగా సాగుతోందని చెబుతున్నారు.గత ఎన్నికల్లో తిరుపతి నుంచి భూమన కరుణాకర్‌రెడ్డి తనయుడు భూమన అభినయ్ రెడ్డి పోటీ చేసి ఓడిపోయారు. అలాగే చంద్రగిరి నుంచి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, మచిలీపట్నం నుంచి పేర్ని కిట్టూ పోటీ చేసినా గెలవలేకపోయారు. దాంతో ఈసారి వీరి ప్లేస్‌లో తండ్రులనే పోటీకి రెడీ కావాలని వైసీపీ హైకమాండ్ సూచించిందని అంటున్నారు. ఈ క్రమంలోనే తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి తిరిగి యాక్టివ్ అయ్యారని చర్చించుకుంటున్నారు. భూమన పార్టీ నేతలతో కూడా ఎక్కువగా సమావేశాలు జరుపుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని కూడా సంకేతాలు ఇస్తున్నారట.తన కుమారుడికి రాజకీయంగా ఎంతో భవిష్యత్తు ఉందని వైసీపీకి రాబోయే ఎన్నికలు కీలకం కావడంతో తానే పోటీకి సిద్ధమవుతున్నానని చెబుతున్నారట. ఇక మాజీ మంత్రి పేర్ని నాని అయితే మచిలీపట్నంలో తన కుమారుడినే పోటీకి పెట్టాలని చూస్తున్నారట. చెవిరెడ్డి భాస్కరరెడ్డి అదే ఆలోచనలో ఉన్నారని..మరోసారి మోహిత్‌రెడ్డినే బరిలోకి దించబోతున్నారట.వీళ్లు ఆల్రెడీ పోటీ చేసి ఓడిన నేతలు. వాళ్లకు టికెట్ ఇచ్చేందుకు వైసీపీ అధిష్టానం సుముఖంగా లేదంటున్నారు. అలాంటిది మరికొందరు నేతలు రాబోయే ఎన్నికల్లో తమ కూతురు, లేదా కొడుకును బరిలోకి దింపాలనుకుంటున్నారు. అయితే కీలక స్థానాలలో తండ్రులే పోటీ పడితే మంచి రిజల్ట్ వస్తాయన్నది వైసీపీ హైకమాండ్ ఆలోచనగా చెబుతున్నారు. ఉత్తరాంధ్రలో బొత్స సత్యనారాయణ తన కుమారుడు బొత్స సందీప్‌ను చీపురుపల్లి నుంచి దించాలని అనుకుంటున్నారట. అలాగే మాజీ ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి తన కుమార్తెకి టికెట్ కోరబోతున్నారట. శ్రీకాకుళంలో ధర్మాన సోదరులు తమ కుమారులనే పోటీకి దించే యోచనలో ఉన్నారని తెలుస్తోంది.అయితే జగన్ వీరికి గ్రీన్ సిగ్నల్ ఇస్తారా లేదా అన్నది సస్పెన్స్‌గా మారింది. వారసులకు టికెట్ ఇవ్వడం పక్కన పెట్టి..సీనియర్ లీడర్లను ఎంపీలుగా బరిలోకి దించాలనేది జగన్ ఆలోచనగా చర్చించుకుంటున్నారు. ఇప్పటికే పోటీ చేసి ఓడిన వారసులకు మళ్లీ టికెట్ దక్కేనా? కొత్తగా వారసులకు సీటు ఇచ్చేందుకు జగన్ ఓకే చెప్తారా? అనేది ఇప్పటికైతే తేలని అంశంగా ఉంది. అయితే అధికారంలో ఉన్న టీడీపీ నెమ్మదిగా సీనియర్లను సైడ్ చేస్తూ యంగ్ లీడర్లకు అవకాశాలు ఇస్తుంటే.. వైసీపీ మాత్రం సీనియర్లను వదలకూడదని పట్టుదలగా ఉండటం ఆసక్తికరంగా మారింది.

# రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు

**పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణాకు తరలింపు**

**అన్నదాత సుఖీభవ కింద రైతు ఖాతాలో ఏటా 20వేలు జమ**

**సూరంపల్లిలో అన్నదాత సుఖీభవను ప్రారంభించిన సిఎం చంద్రబాబు**



విజయవాడ, (ఆర్ఎన్ఎ): రాష్ట్రంలోని రైతులను ఆదుకుంటామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఇప్పుడు ఒక్కో రైతుకు రూ. 6 వేలు ఇస్తున్నామన్నారు. రైతు ఖాతాలో ఏటా రూ.20 వేలు జమ చేస్తున్నామని తెలిపారు. కేంద్రం రూ. 6 వేలు ఇస్తే.. మేం రూ.14 వేలు ఇస్తున్నామని చెప్పారు. శుక్రవారం కృష్ణాజిల్లా గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గంలోని సూరంపల్లిలో అన్నదాత సుఖీభవ, పీఎం సుఖీభవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొని.. రైతుల ఖాతాల్లోకి ఈ పథకానికి సంబంధించిన నిధులు విడుదల చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. రైతులు సైతం టెక్నాలజీ అందిపుచ్చుకుంటున్నా రన్నారు. రైతుల కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. పంటలకు సమయానికి సాగునీరు ఇస్తున్నామని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. పట్టిసీమ ద్వారా గోదావరి నీటిని కృష్ణా జలాలతో కలిపామని సీఎం చంద్రబాబు వివరించారు. ప్రధాని మోదీ అసోంలో ఉండి దేశంలోని రైతులందరి ఖాతాల్లో నగదు వేశారని.. ఇది టెక్నాలజీకి ఉండే మహిమ అని వివరించారు. అదే సమయంలో కేంద్రం ఇవ్వాల్సిన నగదు అక్కడ విడుదల చేస్తే.. మనం ఇక్కడ విడుదల చేశామని సీఎం చెప్పారు. అవన్నీ మీ ఖాతాల్లో ఇప్పుడు పరిశీలించుకునే పరిస్థితికి వచ్చిందంటే.. టెక్నాలజీ ఏ విధంగా పని చేస్తుందో మీరందరూ గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రోజు ఎన్నికల ముందు తాను, పవన్ కళ్యాణ్ రాష్ట్రవ్యాప్తంగా తిరిగి మళ్ళీ రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేయడంతోపాటు రైతుల్ని పూర్తిగా ఆదుకుంటామని మాట ఇచ్చామని చెప్పారు. అందుకే సూపర్ సిక్స్ పథకాలతోపాటు ఇంకొన్ని సంక్షేమ కార్యక్రమాలు హామీ ఇచ్చామని పేర్కొన్నారు. ఆ తర్వాత బీజేపీ కూడా కలిసి ఎన్డీఏ కూటమిగా ఏర్పాటయ్యామని సీఎం చంద్రబాబు వివరించారు. గడిచిన ప్రభుత్వం ఏ విధంగా దగా చేసిందనే విషయాలు కూడా మనం ఎప్పటికప్పుడు గుర్తుపెట్టుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ?ఈ రోజు మూడో విడతలో 46,85000 మంది రైతులకు ఒక్కొక్కరికి రూ. 6 వేలు డిపాజిట్ చేస్తున్నామని తెలిపారు. అటు కేంద్రం కానీ.. ఇటు రాష్ట్రం కానీ కలిపి మొత్తం రూ. 20 వేల అందిస్తున్నామన్నారు. ఈ విషయం రైతులందరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు. తాను రైతు బిడ్డనని.. మధ్యతరగతి కుటుంబంలో జన్మించి ఈ స్థాయికి వచ్చానని తెలిపారు. రైతు కుటుంబాలు ఇబ్బందుల్లో ఉండ కూడదనే తన ఆలోచన, తపన అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. సమైక్య ఆంధ్రప్రదేశ్‌లోనే వ్యవసాయానికి ప్రత్యేక బ్జడెట్ పెట్టించామని చెప్పారు. కృష్ణాజిల్లాలో నీళ్లు ఆలస్యంగా రావడం వల్ల తుఫాన్‌తో రైతులు నష్టపోయారని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు ఇవ్వడం ద్వారా పంటలను కాపాడామన్నారు. నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుల సుడిగుండంలో ఉందన్నారు. ఏపీ ఇమేజ్ దెబ్బ తిందని.. పెట్టుబడులు పెట్టే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు కూడా నిలిచిపోయేలా చేశారన్నారు. ఇరవై నెలల్లో ఒక్కో సమస్యను పరిష్కారం చేసుకుంటూ వస్తున్నామని సీఎం చంద్రబాబు వివరించారు. ఇన్ని సమస్యలు ఉన్నా.. మీకు న్యాయం చేసిన ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వమని ధైర్యంగా చెబుతున్నానన్నారు. 47లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి 24 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు వేశామని పేర్కొన్నారు. ÷-రకృతి విపత్తుల సమయంలో ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామని.. రూ. 300 కోట్లు నష్ట పరిహారం, రూ.500 కోట్ల ధరల స్థిరీకరణకు కేటాయించామని గణాంకాలతో సహా సీఎం చంద్రబాబు వివరించారు. పక్కనే ఉన్న తమిళనాడు కానీ.. కర్ణాటక కానీ రైతులకు ఒక్క రూపాయి ఇవ్వలేదన్నారు. కానీ ఏపీలో రైతుకు గిట్టుబాటు ధర ఇచ్చిన ఏకైక ప్రభుత్వం.. ఎన్డీఏ ప్రభుత్వమని స్పష్టం చేశారు. పొగాకు, ఉల్లి రైతులను ఆదుకునేలా ఆర్థిక సాయం అందించామని చెప్పారు. మోటా, కోకో పంటలు దెబ్బ తింటే.. మద్దతు ధర ఇచ్చి రైతులను ఆదుకున్నామన్నారు. నష్టపోయిన రైతాంగానికి రూ.1,338 కోట్లు అందచేశామని గుర్తు చేశారు. మేము విజన్ 2047 తయారు చేశాం.. ప్రధాని నేతృత్వంలో వికసిత్ భారత్, ఏపీ ప్రభుత్వం స్వర్ణాంధ్ర 2047 కల సాకారం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. మనకు స్వాతంత్య్రం వచ్చి 2047 నాటికి వందేళ్లు అవుతుందన్నారు. ఆ సమయానికి మన దేశం, మన రాష్ట్రం అన్ని విధాలా అగ్రస్థానంలో ఉండాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.

# ఏపీకి గుడ్ న్యూస్ చెప్పిన కేంద్రం

విజయవాడ: కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయంతో ఏపీకి రిలీఫ్ దక్కింది. జల్‌జీవన్ మిషన్ పథకం అమలు కాలపరిమితిని పెంచడంతో లక్షలాది ఇళ్లకు ప్రయోజనం కలగనుంది. కేంద్రం జలజీవన్ మిషన్ పథకం ద్వారా రాష్ట్రంలోని గ్రామాల్లో ప్రతి ఇంటికి కుళాయి సౌక్యరం కల్పించి సురక్షితమైన నీటిని అందించాలని టార్గెట్ పెట్టుకుంది. ఏపీలో కూడా ఈ పథకాన్ని అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని సరిగా అమలు చేయలేదనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరపు నుంచి వాటా నిధులు సరిగా ఇవ్వకపోవడంతో జలజీవన్ మిషన్ పనుల్లో ఆలస్యంకాగా.. ముందుగా నిర్ణయించిన ప్రకారం ఈ పథకం గడువు 2024కే ముగిసింది. దీంతో జలజీవన్ మిషన్ పథకాన్ని రాష్ట్రంలో పూర్తిస్థాయిలో అమలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌లు ఈ పథకంపై ఫోకస్ పెట్టారు. ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సమయంలో జలజీవన్ మిషన్ పథకం కాలపరిమితిని 2028 వరకు పెంచాలని కోరారు. తాజాగా కేంద్ర కేబినెట్ ఈ జలజీవన్ మిషన్ పథకం గడువును 2028 వరకు పొడిగించింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని లక్షలాది ఇళ్లకు ప్రయోజనం కలగనుంది. 2019లో కేంద్రం ఈజలజీవన్ మిషన్ పథకాన్ని తీసుకొచ్చింది. ఆ సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 95లక్షల 53వేల 169 కుటుంబాలు ఉంటే.. ఏపీలో 32.18శాతం ఇళ్లకు కుళాయి సౌకర్యం ఉంది. అయితే గత ఐదేళ్లు పథకాన్ని సరిగా అమలు చేయలేదని ఆరోపణలు ఉన్నాయి. కేంద్రం 2019-20 నుంచి 2024-25 వరకు ఈ పథకాన్నిఅమలు చేసేందుకు మొత్తం రూ.16,855 కోట్లు కేటాయించారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.2,324 కోట్లు డ్రా చేసి రూ.2,316 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత.. ఈ ఏడాది ఫిబ్రవరి 6 వరకు ఏకంగా 71లక్షల 52వేల 326 ఇళ్లకు కుళాయి సౌకర్యం కల్పించారని చెబుతున్నారు.. అంటే దాదాపు 75శాతం వరకు ఇళ్లకు కుళాయిలు అందుబాటులోకి వచ్చినట్లు లెక్క.తాజాగా కేంద్రం జలజీవన్ మిషన్ పథకం కాలపరిమితిని పెంచడంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 24,00,843 ఇళ్లకు ప్రయోజ కనం కలగనుంది. ఈ ఇళ్లకు కూడా కుళాయి సౌకర్యం కల్పించే అవకాశం వచ్చింది. ఇప్పుడు ఈ పథకానికి సంబంధించి మిగిలిన నిధులతో.. మిగిలిపోయిన ఇళ్లకు కుళాయి సౌకర్యం కల్పించను న్నారు. దేశవ్యాప్తంగా 11 రాష్ట్రాలు మాత్రమే 100శాతం గ్రామాల్లో ఇళ్లకు కుళాయి సౌకర్యం కల్పించాయి.. మిగిలిన రాష్ట్రాల్లో పనులు జరుగుతున్నాయి.. దేశవ్యాప్తంగా చూస్తే ఏపీ 29వ స్థానంలో ఉంది. ఇప్పుడు పథకం కాలపరిమితి పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకోవడంతో.. ఈ పనుల్ని మరింత వేగవంతం చేయనున్నారు.

## ఏపీలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ కార్డు

నెల్లూరురు ,: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే రోజుల్లో పౌర సేవల్ని త్వరగా అందించేందుకు, సంక్షేమ పథకాల అమలుకు ఫ్యామిలీ కార్డు (ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్) విధానం అమలు చేయనున్నారు. అమరావతిలో నిర్వహిస్తున్న కలెక్టర్ల సదస్సులో త్వరలోనే ఫ్యామిలీ కార్డు (స్మార్ట్ కార్డ్) విధానం తీసుకొనస్తున్నామన్నారు ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్. ఈ కార్డుతో సంక్షేమ పథకాలను అనుసంధానం చేస్తారని.. ఈ మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ కార్డుతో సూపర్ సిక్స్ పథకాలను కనెక్ట్ చేస్తామంటున్నారు. అలాగే రాష్ట్రంలో 20 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శకులకు అనుసంధానం చేశామన్నారు పీయూష్ కుమార్.ఏపీ ప్రభుత్వం ప్రతి కుటుంబం ఒక యూనిట్‌గా ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఎఫ్‌బీఎంఎస్)ను తీసుకొస్తోంది.. ఫ్యామిలీ స్మార్ట్ కార్డును జారీ చేయాలని నిర్ణయించింది. ఈ కార్డులో 26 అంశాలతో (ఫ్యామిలీ ఐడీ, ఆధార్ నెంబర్, రైస్ కార్డ్ ఐడీ, విద్యార్హతలు, వృత్తి, మొబైల్ నంబర్, చిరునామా, వ్యవసాయ భూమి, అర్బన్-రూరల్ ప్రాపర్టీ వంటి వివరాలు) డేటాబేస్ రూపొందించనున్నారు. ఇప్పటికే 82 శాతం సమాచారం ఉండగా.. ఏప్రిల్ 30 నాటికి 90 శాతం డేటా బేస్ సిద్ధం చేస్తామంటున్నారు. రాష్ట్రంలో ప్రతీ కుటుంబానికి ఫ్యామిలీ కార్డు అందించేలా ప్లాన్ చేశారు అధికారులు. ఈ ఫ్యామిలీ కార్డును క్యూఆర్ కోడ్‌తో రూపొందించనున్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసిన ఆ కుటుంబానికి సంబంధించిన సమాచారం తెలుస్తుంది.. కుటుంబానికి సంబంధించిన పత్రాలను తీసుకెళ్లాల్సిన అవసరం ఉండదు అంటున్నారు. ఏపీ ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలనలో భాగంగా ఈ ఫ్యామిలీ కార్డు ద్వారా అర్హులైన వారందరికీ పథకాలు అందించేందుకు, పౌర సేవలుకూడా సులభతరం చేసేందుకు ఈ నిర్ణయం తీసుకుంది.

# సినిమా

## అట్లీ-అల్లు అర్జున్ కాంబోపై భారీ అంచనాలు






ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ మరియు మాస్ డైరెక్టర్ అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ ప్రాజెక్ట్ 'ఎఎ22'పై అంచనాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమా సౌత్‌తో పాటు నార్త్ ఇండియాలోనూ భారీ హైప్‌ను క్రియేట్ చేసింది. అయితే ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన ఎలాంటి అధికారిక ప్రమోషనల్ కంటెంట్ విడుదల చేయకుండా మేకర్స్ గట్టి సీక్రసీని మెయింటైన్ చేస్తున్నారు. ఇటీవల అట్లీ తన సోషల్ మీడియాలో షేర్ చేసిన లయన్ పోస్టర్ ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

ఆ పోస్టర్‌లో సింహం ముఖం రెండు వేర్వేరు భాగాలుగా కనిపించడం విశేషం. దీనితో సినిమాలో అల్లు అర్జున్ డ్యూయల్ రోల్‌లో కనిపించనున్నారా? లేక ఒక క్లిష్టమైన, మల్టీ-లేయర్డ్ క్యారెక్టర్‌లో నటిస్తున్నారా? అన్న సందేహాలు అభిమానుల్లో మొదలయ్యాయి. అట్లీ పోస్టర్‌కు జతచేసిన 'నీలా ఎవరూ ఉండలేరు, అదే నీ శక్తి' అనే క్యాప్షన్ మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది.

ఇది హీరో పాత్రలో ఉన్న విభిన్న కోణాలను సూచిస్తోందని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సన్ పిక్చర్స్ సుమారు రూ.600 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిస్తోంది. ఈ స్థాయి వ్యయంతో రూపొందుతున్న ఈ సినిమా భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. అల్లు అర్జున్ ఇప్పటికే పాన్-ఇండియా స్టార్‌గా తన స్థాయిని నిరూపించుకోగా, అట్లీ తన మాస్ కమర్షియల్ టేకింగ్‌తో వరుస విజయాలు అందుకున్న దర్శకుడు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో, ట్రేడ్ వర్గాలు ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు పెట్టుకున్నాయి. బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు.

అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా ఏప్రిల్ 8న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ విడుదల చేసే అవకాశముందని సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉన్నప్పటికీ, అభిమానులు మాత్రం ఆ తేదీ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే అట్లీ షేర్ చేసిన లయన్ పోస్టర్ నిజంగానే అల్లు అర్జున్ పాత్రపై హింట్ ఇస్తుందా? లేక ఇది కేవలం ఆసక్తి రేకెత్తించే ప్రమోషనల్ స్టాట్రజీనా? అన్నది తెలియాలంటే టీజర్ రిలీజ్ వరకు వేచి చూడాల్సిందే.

## జూన్‌లో మల్టీస్టారర్ షురూ




ఈ ఏడాది 'మనశంకర వరప్రసాద్‌గారు' చిత్రంతో భారీ విజయాన్ని దక్కించుకున్నారు దర్శకుడు అనిల్ రావిపూడి. ఈ విజయోత్సాహంలో ఆయన తదుపరి చిత్రానికి సిద్ధమవుతున్నారు. వెంకటేష్, కల్యాణ్‌రామ్ కలిసి నటించనున్న ఈ మల్టీస్టారర్ జూన్ నెలోలో సెట్స్ మీదకు వెళ్లనున్నట్లు సమాచారం. షైన్‌స్క్రీన్స్, సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించనున్నాయి. దర్శకుడు అనిల్ రావిపూడి తనదైన హాస్యం, యాక్షన్ అంశాల కలబోతగా ఈ సినిమా స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట. ఇందులో ఓ కథానాయికగా కీర్తి సురేష్‌ను ఖరారు చేశారని, మరో నాయిక కోసం చిత్రబృందం అన్వేషణలో ఉందని సమాచారం. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' చిత్రంలో నటిస్తున్నారు వెంకటేష్. చిత్రీకరణ జరుగుతున్నది. ఇది పూర్తయిన వెంటనే అనిల్ రావిపూడి మల్టీస్టారర్‌లో వెంకటేష్ జాయిన్ కానున్నారు. ఈ సినిమాను కూడా వచ్చే ఏడాది సంక్రాంతి బరిలో దించేందుకు సన్నాహాలు చేస్తున్నారని సమాచారం.

## శ్రీలీలకు వరుస ఫ్లాపులు..?



టాలీవుడ్‌లో సెన్సేషనల్ డెబ్యూతో ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిన శ్రీలీల,చాలా తక్కువ కాలంలోనే స్టార్ హీరోల సరసన వరుస అవకాశాలు దక్కించుకుని బిజీ హీరోయిన్‌గా మారింది. తన డాన్స్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో యూత్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, ప్రస్తుతం కెరీర్‌లో కాస్త కఠిన దశను ఎదుర్కొంటున్నట్లు కనిపిస్తోంది.'భగవంత్ కేసరి' వంటి కొన్ని సినిమాలు మినహా,ఆమె నటించినచాలా చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయాయి. ఈ నేపథ్యంలో, తాజాగా విడుదలైన ఉస్తాద్ భగత్ సింగ్ సినిమాపై ఆమె భారీ ఆశలు పెట్టుకుంది. ఇందులో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటించడం కూడా సినిమాకు హైప్‌ను తీసుకువచ్చింది. అయితే, సినిమా విడుదల తర్వాత పరిస్థితి ఆశించిన విధంగా లేకపోవడం గమనార్హం. విమర్శకుల నుంచి నెగిటివ్ టాక్ రావడంతో పాటు, బాక్సాఫీస్ వద్ద కూడా సినిమా ప్రదర్శన సంతృప్తికరంగా లేకపోవ డం చిత్రబృందానికి నిరాశ కలిగిస్తోంది. ముఖ్యంగా, ఈ సినిమా లో శ్రీలీల పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేకపోవడం ప్రేక్షకులను నిరుత్సాహానికి గురిచేసింది. పవన్ కళ్యాణ్‌తో జోడీ విషయంలో సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోలింగ్ జరుగుతోంది. క్యారెక్టర్ డిజైన్ సరైన స్థాయిలో లేకపోవడం, పెర్ఫార్మెన్స్‌కు పెద్దగా స్కోప్ లేకపోవడం వంటి అంశాలు విమర్శలకు దారి తీస్తున్నాయి. ఒకప్పుడు స్టార్ హీరోల సినిమాల్లో వరుసగా అవకాశాలు అందుకున్న శ్రీలీల, ఇప్పుడు తన ఫామ్‌ను తిరిగి అందుకోవడానికి కృషి చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక, వరుస పరాజయాలు వచ్చినప్పటికీ, శ్రీలీల తన రెమ్యూనరేషన్ తగ్గించలేదన్న వార్తలు కూడా పరిశ్రమలో చర్చనీయాంశంగా మారాయి. దీనితో పలువురు నిర్మాతలు ఇతర హీరోయిన్లను ఎంపిక చేసుకునే దిశగా మొగ్గు చూపుతున్నారని సమాచారం. ప్రస్తుతం ఆమె చేతిలో పెద్దగా క్రేజీ ప్రాజెక్టులు లేకపోవడం కూడా ఆమె కెరీర్‌పై ప్రభావం చూపుతోంది. ఈ పరిస్థితుల్లో, శ్రీలీల ఇప్పుడు బాలీవుడ్‌పై దృష్టి సారించినట్లు టాక్ వినిపిస్తోంది. కొత్త అవకాశాల కోసం హిందీ చిత్రసీమలో ప్రయత్నాలు ప్రారంభించిందని సమాచారం.


## మెగా 158 షూటింగ్!






మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఆసక్తికరమైన వార్త. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్ మరోసారి పునరావృతం కానుంది. మెగాస్టార్ కెరీర్‌లో 158వ చిత్రంగా రానున్న ఈ సినిమా షూటింగ్ వచ్చే ఏప్రిల్ రెండో వారం నుంచి ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా సినిమాకు సంబంధించిన అధికారిక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి షెడ్యూల్‌లో చిరంజీవిపై కొన్ని సోలో ఎంట్రీ సన్నివేశాలను, ఆ వెంటనే ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించాలని దర్శకుడు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు. ఇటీవల 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో విజయాన్ని అందుకున్న చిరంజీవిని ఈ సినిమాలో పూర్తిస్థాయి మాస్ అవతార్‌లో చూపించనున్నారని తెలుస్తోంది. అయితే కేవలం మాస్ అంశాలకే పరిమితం కాకుండా కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేస్తూ బాబీ ఓ ప్రత్యేకమైన కథను సిద్ధం చేశారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవిని సరికొత్తగా ప్రజెంట్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' భారీ విజయం సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో, ఇండస్ట్రీలోనూ అంచనాలు రెట్టింపయ్యాయి. మాస్, ఎమోషన్ కలగలిపి రానున్న ఈ చిత్రం మెగాస్టార్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందేమో చూడాలి.

## ఫ్యాన్స్‌కి గుడ్ న్యూస్ చెప్పిన పూజా హెగ్డే..



ఒకప్పుడు టాలీవుడ్ టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన పూజా హెగ్డే ఆ తర్వాత తెలుగులో అంతగా అవకాశాలని అందిపుచ్చుకోలేకపోయింది. దాదాపు స్టార్ హీరోలందరితో కలిసి నటించిన పూజా హెగ్డేకి ఇటీవలి కాలంలో టాలీవుడ్ ఆఫర్సే లేవు. పూజా తెలుగులో సినిమా చేయక మూడేళ్లు అవుతుంది. పూజా హెగ్డేకి డీజే దువ్వాడ జగన్నాథం సినిమా మంచి గుర్తింపు తీసుకు రాగా, ఆ తర్వాత అల వైకుంఠపురములో అద్భుతంగా నటించి బుట్టబొమ్మగా అందరి మనసులలో నిలిచింది. పూజా నటించిన అరవిందసమేత వీరరాఘవ, మహర్షి లాంటి చిత్రాలు హిట్స్ కావడంతో పూజా టాలీవుడ్ టాప్ హీరోయిన్స్‌లో ఒకరిగా మారింది. అయితే మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ తర్వాత పూజా హెగ్డేకి ఒక్క హిట్ రాలేదు. రాధే శ్యామ్, ఆచార్య నిరాశ పరచగా డబ్బింగ్ మూవీ బీస్ట్‌తో పాటు హిందీ సినిమాలు సర్కస్, కిసీకా భాయ్ కిసీకా జాన్, దేవా సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టాయి.

## అందాన్ని తప్పించుకుని తిరుగుతున్న అదృష్టం!

ఇప్పుడంటే రాన్రాను తెరపై కథానాయికలకు చోటు లేకుండా పోతోందిగానీ, ఒకప్పుడు ముగ్గురేసి హీరోయిన్స్ సందడి చేసిన సినిమాలు ఉన్నాయి. ఆ ముగ్గురి వైపు నుంచి చూపించలేని గ్లామర్‌ను కొసరు వేయడానికి ఓ ఐటమ్ గాళ్ కావలసి వచ్చేది. ఎందుకంటే సినిమాకి కథాకథనాలు ఎంత అవసరమో, గ్లామర్ కూడా అంతే అవసరమని భావించేవారు. వాళ్ల అభిప్రాయం సరైనదేనని మాస్ ఆడియన్స్ నిరూపించేవారు.అయితే ఆ మధ్య కాలంలో ఓ అందాల హీరోయిన్ తెరపై తెల్ల కలువలా విరిసింది. విశాలమైన కళ్లతో .. విరుగుడు లేని చూపులతో కుర్రకారు ప్రేక్షకులకు కునుకు లేకుండా చేసింది. చక్కని కనుముక్కుతీరుతో వెండితెరకు వెలుగు తీసుకొచ్చిన బ్యూటీగా ఆమెను గురించి చెప్పుకున్నారు. ఆ సుందరి పేరే అనూ ఇమ్మాన్యుయేల్. అనూ లోని ప్రత్యేకమైన ఆకర్షణ ఆమెకి వరుస అవకాశాలు దక్కేలా చేశాయి. దాంతో ఈ బ్యూటీ ఒక రేంజ్ లో దూసుకెళ్లడం ఖాయమని అంతా అనుకున్నారు.

నాని 'మజ్ను'తో ఎంట్రీ ఇచ్చిన ఈ సుందరి, 'అజ్ఞాతవాసి' .. 'నా పేరు సూర్య' సినిమాలతో టాప్ హీరోయిన్ కేటగిరీలోకి వెళ్లిపోతుందని అభిమానులు అనుకున్నారు. కానీ ఆ సినిమాలు మాత్రమే కాదు, ఆ తరువాత చేసినవి కూడా సరిగ్గా ఆడలేదు. ఇప్పుడు కొత్త ప్రాజెక్టులకు సంబంధించి ఈ కోల కళ్ల భామ పేరు ఎక్కడా వినిపించడం లేదు. అదృష్టం ఎదురుపడితే అమ్మడు తప్పుకుపోయిందా? లేదంటే అదృష్టమే తప్పించుకుని పోయిందా? అనేదే అభిమానులకు అర్థం కానీ ప్రశ్నగా మిగిలిపోయింది.



Pub ished & Owned by Mamidi Somaiah, H.No.3 2 92/27 to 276/506, Rock Town Co ony, B Nagar, Hyd, Rangareddy, Te angana 500068. Printed at E ora Printers, N Nagar, Industria Estate, Uppa , Rangareddy, Te angana. Editor Mamidi Somaiah. Ph No. 9 00933723.RNI No. TE TE . 12/48343